విశాలాంధ్ర

ప్రకాశం

బాపట్ల

ఆదివారం 14 జూలై 2024 8 పేజీలు

విద్య, వైద్య ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

- ❑పేదలకు మెరుగైన వైద్యమే ప్రభుత్వ ధ్యేయం
- ❑ వైసీపీ ప్రభుత్వం ప్రజలకు చేసింది శూన్యం
- ❑మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : విద్య, వైద్యం ఆరోగ్యానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. శనివారం పొదిలిలో ప్రాంతీయ వైద్యశాలను మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి గోడలపై నాటి ముఖ్యమంత్రి జగన్ ఫోటోలు ఉండడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా ప్రభుత్వ భవనాలపై నాటి ముఖ్యమంత్రి ఫోటోలు ఉండటం ఏంటని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆస్పత్రిలో రికార్డులు పరిశీలించి, ఆస్పత్రిలో అందుతున్న వైద్యంపై మంత్రి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అన్ని రకాల వైద్యులు ఉన్నా వైద్యం చేయకుండా రోగులను బయట ఆసుపత్రులకు పంపిస్తున్నారని రోగులు, స్థానిక ప్రజలు మంత్రికి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలను ఏదో ఉద్ధరించామంటూ గత ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని, అందుకు ఈ ఆసుపత్రిలో పరిస్థితిలే నిదర్శనం అన్నారు. ఆస్పత్రిలో రోగులకు సరిపడా పరికరాలు అందుబాటులో లేవన్నారు. రక్త నిల్వ కేంద్రం ఉన్నా రోగులకు ఉపయోగపడం లేదన్నారు. తమ ప్రభుత్వం విద్యా, వైద్య ఆరోగ్యా నికి పెద్ద పెద్ద వేస్తుందని, ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే తమ లక్ష్యమన్నారు. వైసీపీ హయాంలో మాదిరి ఉద్యోగులు నిర్లక్ష్యంగా ఉంటే సహించేది లేదని, ఉద్యోగులతో మా ప్రభుత్వం ఫ్రెండ్లీగా ఉంటుందని ఉద్యోగులు కష్టపడి మంచి పేరు రావాలని మంత్రి సూచించారు.

జిల్లా నూతన ఎస్పీగా ఏఆర్ దామోదర్

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : ప్రకాశం జిల్లా నూతన ఎస్పిగా ఏఆర్ దామోదర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ప్రకాశం జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న సుమిత్ సునీల్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువు తీరిన తరువాత శనివారం సాయంత్రం రాష్ట్ర వ్యాప్తంగా 37 మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ప్రకాశం జిల్లా ఎస్పిగా ఏఆర్ దామోదర్ నియమించారు. గత కొన్ని రోజుల నుంచి జిల్లా ఎస్పి నియామకాలపై పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతుంది. ముందుగా అనుకున్నట్లే జిల్లా ఎస్పి బదిలీ ఖాయమైంది. రాష్ట్రంలో ఆయా ఎస్పిలను ఆయా జిల్లాల్లో పనితీరును గుర్తించి ఎస్పిల నియామకం జరిగినట్లు తెలుస్తుంది. జిల్లాలో జిల్లా ఎస్పి బదిలీపై కూడా జిల్లాకు చెందిన మంత్రి, ఎమ్మెల్యేల అభిప్రాయం కూడా పరిగణలోకి తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఎన్నికల ముందు జిల్లా ఎస్పిగా బాధ్యతలు చేపట్టిన సుమిత్ సునీల్‌ను ఎన్నికల అనంతరం బదిలీ చేస్తారని అందరూ ఊహించారు. అదే విధంగా ప్రస్తుత ఐపీఎస్ బదిలీల్లో వీరిని బదిలీ చేశారు. అయితే ఏదో ఒక జిల్లాకు పోస్టింగ్ ఇస్తారని భావించారు. కానీ ఏ జిల్లాకు పోస్టింగ్ ఇవ్వకపోగా డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులలో పేర్కొన్నారు.

బాపట్ల జిల్లా ఎస్పీగా తుషార్ డూడి

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల జిల్లా నూతన ఎస్పీగా తుషార్ డూడిని నియమిస్తూ శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. గుంటూరు ఎస్పీగా పనిచేస్తూ శనివారం జరిగిన బదిలీల్లో బాపట్ల జిల్లాకు తుషార్ డూడీని కేటాయించారు. బాపట్ల జిల్లా ఎస్పీగా ఉన్న వకుల్‌జిందాల్‌ను విజయనగరం జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు. ఎస్పీ జిందాల్ బాపట్ల జిల్లా ఎస్పీగా 27 నెలల పాటు విధులు నిర్వహించారు.

త్రిశంకు స్వర్గంలో

నివేశనా స్థలాలు, గృహాలు

- ○ రియల్ ఎస్టేట్‌గా మారిన రెవెన్యూ శాఖ
- ○నివేశనా స్థలాల మారు బేరంలో లేడి విఆర్ఓ
- ○నిరంతరాయంగా ఆక్రమణలు, అమ్మకాలు, కొనుగోళ్ళ పర్వం

విశాలాంధ్ర - వేటపాలెం : గత ప్రభుత్వం నిరుపేదలకు పెద్దఎత్తున నివేశనా స్థలాలు కేటాయించి సామాన్యుల సొంత ఇంటి కలను సాకారం చెయ్యాలనే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నివేశనా స్థలాల పంపిణీ నీరుగారింది. రెవెన్యూ శాఖ అవినీతి కారణంగా నిరుపేదలకు ప్రభుత్వం ఇంటి స్థలాల మంజూరు చేసి చేపట్టిన కాలనీల నిర్మాణం కాసుల కేంద్రాలుగా మారాయి. చేనేతపురి, దత్తక్షేత్రం, జగనన్న కాలనీలలో రాజకీయ ప్రమేయంతో అనర్హులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేశారని ఆరంభం నుండే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు తాజాగా రెవెన్యు అధికారుల ఆక్రమణలు, అమ్మకాలు, కొనుగోళ్ళ పర్వం జోరందుకోవడంతో

మిగతా 2 లో ...

క్రమశిక్షణ విజయ సోపానాలకు తొలిమెట్టు

కొమ్మారెడ్డి కిషోర్

విశాలాంధ్ర-బంటుమిల్లి : క్రమశిక్షణతో అభ్యసించే విద్య విజయాలకు తొలిమెట్టని కొమ్మారెడ్డి టాలెంట్ హైస్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ అన్నారు .ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ శనివారం పాత్రికేయులతో మాట్లడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే ఎంతటి విజయనైనా అందుకోగలమని శ్రీవిద్య నిరూపించిందని అన్నారు .తమ పాఠశాలలో పదవ తరగతి 2024 సం ,,లో విద్యను అభ్యసించిన వి ఎల్ ఎన్ శ్రీవిద్య 600 వందల మార్కులకుగాను 591 మార్కులు సంధించి అత్యుత్తమ ప్రతిభను కనబరిచిందన్నారు .రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జి టెక్నాలజీ (ఆర్ జి యూ కె టి) నందు ట్రిబుల్ ఐటీలో సెలక్షన్ లిస్టులో సీటు సాధించిందన్నారు .ఈ సందర్భంగా శ్రీవిద్యను అభినందిస్తూ భవిష్యత్తులో మరెన్ని విజయాలను సంధించి తల్లిదండ్రులకు ,పుట్టిన గ్రామానికి ,మనదేశానికి మంచిపేరు తీసుకురావాలి కిషోర్ ఆశీర్వదించారు .ఇంతటి ఘనవిజయన్ని సాదించిన విద్యార్థి శ్రీవిద్యను పాఠశాల సెక్రెటరీ ,కరస్పాండెంట్ కె ఎస్ వి జి శోభ ,డైరెక్టర్ కొమ్మారెడ్డి చైతన్య ,ప్రధానోపాధ్యాయులు ఎన్ శ్రీనివాసరావు ,ఉపాధ్యాయిని ,ఉపాధ్యాయులు ,తోటి విద్యార్థిని ,విద్యార్థులు అభినందనలు తెలిపారు ...

కుష్టు వ్యాధి రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- వైద్యాధికారి కె సువర్చల

విశాలాంధ్ర-బంటుమిల్లి : కుష్టు వ్యాధి రహిత సమాజాన్ని నిర్మించి ప్రజారోగ్య పరిరక్షణకు కృషిచేద్దామంటూ శనివారం మండల పరిదిలోని పెదతుమ్మిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు వైద్య సిబ్బందికి ,ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని వైద్యాధికారి కె సువర్చల నిర్వహించారు .ఈ సందర్భంగా వైద్యాధికారి కె సువర్చల మాట్లాడుతూ కుష్టు వ్యాధి ఇంటింటి సర్వే కార్యక్రమము ఈ నెల 18 వ తేదీ నుండి ఆగష్టు12 వ తేదీ వరకు లెప్రొసి కేసు డిటెక్షన్ క్యాంపెయిన్ నిర్వహించడం జరుగుతుంది అని అన్నారు. ఈ వ్యాధి మైకో బాక్టీరియా లెప్రే అనే క్రిమి వలన వస్తుంది. ఈ క్రిములు తుమ్మడం వలన, దగ్గడం వలన గాలి ద్వారా వ్యాప్తి చెందుతాయి అన్నారు.ఈ వ్యాది లక్షణాలు కనిపించుటకు 5 నుండి 7 సంత్సరాలు కాలము పట్టవచ్చుఅన్నారు.చర్మంపై స్పర్శ్ లేని రాగి రంగు మచ్చలు, లావుగా మారిన నొప్పితో కూడిన నరములు, కాళ్ళు లేదా చేతులు కండరాలలో బలహీనత, నొప్పిగా అనిపించని పుండ్లు చేతులు పాదాలలో ఉండడం, కళ్ళు పూర్తిగా ముసుకొలేక పోవడం, చెవి తమ్మెలు మందంగా మారిపోవడం, చర్మంపై, చెవి తమ్మెల పై బుడిపెలు ఉండడం, కాళ్ళ నుండి చెప్పులు జారిపోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే డాక్టర్ నీ సంప్రదించాలని వివరించారు. ఎవరికి వారే స్వీయ పరీక్ష చేసుకొని కుష్టు వ్యాధి రహిత సమాజం కోసం కృషి చేయలని కోరారు.ఈ వ్యాధి నీ ప్రారంభ దశలో గుర్తించి చికిత్స తీసుకుంటే అంగ వైకల్యం రాకుండ కాపాడుకోవచ్చును అని అన్నారు .అనంతరం బంటుమిల్లి గ్రామ పురవీధులలో ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలకు కుష్టువ్యాది నివారణపై వివరిస్తూ నినాదాలు చేశారు .ఈ కార్యక్రమంలోఎం పి హెచ్ ఈ ఓ ఏడుకొండల రావు,పిహెచ్ఎన్ పెద్ది ఈశ్వరి,హెల్త్ సూపర్ వైజర్ ఎం ఏసుదాసు, హెచ్ వి కమల రత్నం, ఎం ఎల్ హెచ్ పి లు ,ఎ ఎన్ ఎం లు,హెల్త్ అసిస్టెంట్ రాజారావు,ఆశా కార్యకర్తలు , వైద్య సిబ్బంది పాల్గొన్నారు

విద్యుత్తు సర్దుబాటు చార్జీలు తగ్గించాలి

విశాలాంధ్ర - గుడివాడ : జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను అనేక పేర్లతో విపరీతంగా చార్జీలను పెంచడం జరిగిందని, ట్రూ ఆఫ్ చార్జి, సర్దుబాటు చార్జీలు అదనంగా విద్యుత్తు వాడకానికి రకరకాల పేర్లతో విద్యుత్తు చార్జీలు పెంచడం జరిగిందని వాటిని నూతనంగా ఏర్పాడిన కూటమి ప్రభుత్వం తగ్గించాలని సిపిఎం మండల కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి డిమాండ్ చేశారు.శనివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆర్‌సిపి మాట్లాడుతూ నూతనంగా ఏర్పాడిన కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను నియంత్రిస్తామని ప్రకటించడం జరిగిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం విద్యుత్ చార్జీలలో ఉన్నా ట్రూ ఆఫ్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు, ఎనర్జీ చార్జీల పేర్లతో ఉన్న అదనపు చార్జీలు తగ్గించాలన్నారు. ఎస్‌ఎఫ్ఐ నాయకులు సమీర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అన్నసంతర్పణ

విశాలాంధ్ర-అవనిగడ్డ : జనసైనికుల ఆద్వర్యంలో అన్నసంతర్పణ కార్యక్రమం 53వ వారం కొనసాగింది. ఆంధ్రుల అన్నపూర్ణగా పేరొందిన డొక్కా సీతమ్మను ఆదర్శంగా తీసుకుని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు గరికిపాటి రామ్, వివేక్ మిత్ర బృందం ఆద్వర్యంలో ప్రతి శనివారం మధ్యాహ్నం అవనిగడ్డ, కోడూరు రోడ్డులో గల పెట్రోల్ బంక్ వద్ద అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 53 వ శనివారం రేపల్లె ఆదిశేషమ్మ జ్ఞాపకార్థం వారి మనవడు ఆర్థిక సహకారంతో అన్నదానం చేశారు. ఎం.పి.టి.సిలు బొప్పన బాబు, మద్దెల అజయ్ కుమార్, కిరణ్ కుమార్‌లతో పాటు పలువురు జనసైనికులు పాల్గొని వారి సేవలందించారు.

త్రిశంకు స్వర్గంలో

నివేశనా స్థలాలు, గృహాలు

ఫిర్యాదులు పర్వం కొనసాగుతోంది. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయడంతో చీరాల ఆర్డిఓ ను స్వయంగా పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో జరిగిన విచారణలో అక్రమా గోల పర్వం బహిర్గతం కావడంతో ఉన్నతాధికారులు నివ్వెరపోయారు. అనర్హులకు నివేశనా స్థలాలు, గృహాలు మంజూరు చేయడం వల్లనే స్థానికంగా వారు నివాసం ఉండకపోవడంతో రెవెన్యూ అధికారులకు, రాజకీయ తాబేదార్లకు ఈ కాలనీలు కాసుల పంటగా మారాయని స్పష్టం అవుతోంది. ఇప్పటికైనా సమగ్రంగా దర్యాప్తు చేసి అనర్హులను గుర్తించి రద్దు చేసి అర్హులైన వారికి నివేశనా స్థలాల పంపిణీ చేయడం ద్వారా నిరుపేదలకు అండగా నిలవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

- చేనేతపురి కాలనీ

చేనేతపురి కాలనీలో లేఅవుట్ ప్రకారం ప్రభుత్వం 1371 నివేశనా స్థలాలు మంజూరు చేసింది. 1000 కి పైగా చేనేత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో గృహాల నిర్మాణం చేసింది. కానీ ప్రస్తుతం సుమారు 650 కుటుంబాలు మాత్రమే నివశిస్తున్నాయి. మిగిలిన నివేశనా స్థలాలలో ఇంటి నిర్మాణం అసంపూర్తిగాను, కొన్ని బేస్ మెంట్ దశలో నిలిచిపోయాయి. మాజీ శాసన సభ్యుడు అనుచరుడు పలమర్తి చంద్రశేఖర్ కూడా నివేశనా స్థలం మరియు గృహం పొందినప్పటికీ, స్థానిక విఆర్ఓ అమూల్య సహకారంతో 7 ఇండ్లను కొనుగోలు చేసి అద్దె రూపంలో ఆదాయం పొందుతున్నాడు. పలమర్తి చంద్ర శేఖర్ వద్ద ఇప్పటికీ 6 గృహాలు తాకట్టులో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. విఆర్ఓ సహకారంతో బొద్దు పుష్పలత అనే స్థానిక మహిళ 6 నివేశనా స్థలాలు కొనుగోలు చేసినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు.

- దత్తక్షేత్రం కాలనీ

మండల పరిధిలోని చల్లారెడ్డిపాలెం పంచాయతీ దత్తక్షేత్రం కాలనీలో ఖాళీ స్థలాలను రెవెన్యూ అధికారులు అక్రమార్కులకు దారాదత్తం చేశారు. వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం పంచాయితీ దత్తక్షేత్రం కాలనీలో లేఅవుట్ ప్రకారం ఒకటిన్నర సెంటు ప్రకారం 202 మందికి ఇంటి స్థలం మంజూరు చేసి పొజిషన్ పంపిణీ చేయడంతో పాటు, గృహనిర్మాణానికి ప్రభుత్వ ఋణం పొందే విధంగా సౌకర్యం కల్పించారు. ప్రస్తుతం సుమారు 100 కు పైగా కుటుంబాలు దత్తక్షేత్రం కాలనీ నందు నివసిస్తున్నారు. కాలని అంతర్గత రోడ్ల నిర్మాణంలో భాగంగా పలు చోట్ల సామాజిక అవసరాల నిమిత్తం లేఅవుట్ లో ఖాళీ స్థలములు వదిలివేయడం జరిగింది. సదరు ఖాళీ స్థలములలో కొంతభాగం రూడ్ సెట్ సంస్థ వారికి కేటాయించినప్పటికీ సదరు సంస్థ ప్రకాశం జిల్లా ఒంగోలుకు తరలిపోవడంతో, ఖాళీస్థలమును మరియు ఇతర స్థలాలను గతంలో తహశీల్దార్ గా యం.లింగమహేశ్వరరావు పనిచేసి పదవీకాల ముగుస్తున్న సమయంలో ఒక వివాదం కేంద్రంగా జరిగిన పంచాయితీలో భాగంగా, అప్పటి చల్లారెడ్డిపాలెం వీఆర్ఓ కు తలెత్తిన ఘర్షణ విషయమై కొన్ని లక్షల రూపాయలు కూడా ముట్ట జెప్పి, తప్పుడు పద్ధతుల్లో ప్రైవేట్ వ్యక్తికి మిగిలిన ఖాళీ భూములను దారాదత్తం చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పందిళ్లపల్లికి అప్పటి చీరాల శాసనసభ్యుడు చీరాలలో నివాసం ఉంటున్న అతని అనుచరులకు ఇష్టం వచ్చినట్లు రెవెన్యూ అధికారులు ప్లాట్స్ కేటాయించగా, వారు ఆ ప్లాట్స్ ను చట్టవిరుద్ధంగా అమ్ముకుని మరలా ప్రభుత్వ ఇంటిస్థలం పొందడం జరిగిందని రెవెన్యూ అధికారులపై ఆరోపణలు ఉన్నాయి.

- జగనన్న కాలనీ

గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా లక్షల సంఖ్యలో నిరుపేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేసిన సమయంలో చేనేతపురి కాలనీలో జగనన్న కాలనీ పేరుతో 303 మందికి నివేశనా స్థాలాలు మంజూరు అయ్యాయి. మండలంలోని దేశాయి పేట, వేటపాలెం, పందిళ్ళపల్లికి చెందిన వారికి ఇంటి స్థలాలు మంజూరు చేసి గృహాలు కూడా నిర్మాణం చేశారు. కానీ ప్రస్తుతం 20 కుటుంబాలు మించి ఇక్కడ నివాసం ఉండుట లేదు. అందుకు ప్రధాన కారణం లబ్దిదారులకు సొంత నివాసం ఉండటమే. ఈ కాలనీలో అమ్మకాలు కొనుగోళ్ళు జరుగుతున్నప్పటికీ అక్కడి పరిస్థితులు రీత్యా నివాసం ఉండుటకు ఎవరూ ఇష్టపడుటలేదు.

- స్మశానం లేదు: స్థానికులు

2000 కుటుంబాలు నివాసయోగ్యమైన చేనేతపురి, దత్తక్షేత్రం, జగనన్న కాలనీలలో స్మశానానికి భూమి కేటాయించకపోవడం వలన ఇక్కడ నివసిస్తున్న కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నాయి. మరోమార్గం లేక మరణించిన వారిని రొంపేరు కరకట్టల వద్ద ఖననం చేస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు. అయితే ఈ కాలనీలకు, రొంపేరు కరకట్టకు మధ్య కొత్తపాలెంకు చెందిన ఓ రాజకీయ అనుచరులు ఇంటిస్థలాలను సుమారు 2 ఎకరములు ఆక్రమించి వ్యవసాయం చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు, అయితే రిటైర్డ్ తహశీల్దార్ యం.లింగమహేశ్వరరావు పదవీవిరమణ సమయంలో చాకిరేవు పేరుతో చట్ట విరుద్ధంగా 40 సెంట్లు భూమి కేటాయించగా, సదరు భూమి పొందిన కల్లూరి నాగరాజు, రొంపేరు కరకట్టతోపాటు సొసైటీ భూమి కలిపి ఎకరం పైగా భూమి ఆక్రమించినట్లు స్థానికులు చెబుతున్నారు.

- అంతా రెవెన్యూ శాఖకు తెలుసంటున్న స్థానికులు

దత్తక్షేత్రం కాలనీలో 202 ప్లాట్ ప్రక్కన జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ఆర్డీవో కు చరవాణి ద్వారా ఫిర్యాదు చేసినప్పటికీ స్థానిక రెవెన్యూ అధికారులు స్పందించలేదు. స్థానిక విఆర్ఓ భూకబ్జాలను ప్రోత్సహించారని తీవ్ర ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. దత్తక్షేత్రం కాలనీలో ఖాళీ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్ళి అక్రమ నిర్మాణాలను సకాలంలో అడ్డుకోవడంలో విఆర్ఓ పూర్తిగా విఫలం అయ్యారు. అందుకు ప్రధాన కారణం అవినీతికి పాల్పడి అక్రమార్కులకు ఆమె సహకరిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆర్డీవో విచారణ సమయంలో అక్రమ నిర్మాణాల విషయమై అధికారులకు స్పష్టమైన సమాచారం ఇవ్వకుండా దాటవేత ధోరణితో వ్యవహరించడం, రికార్డ్స్ వెంట తీసుకురాకోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. అంతేకాకుండా చేనేతపురిలో సుమారు వంద కు పైగా నివేశనా స్థలాలు ఒక్కొక్కటి 50 వేలు కు తగ్గకుండా అమ్మకాలు చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. రోశయ్య ఎత్తిపోతల పథకం సొసైటీ చైర్మన్ గా వ్యవహరించిన చోటా నాయకుడు, విఆర్ఓ , సహకారంతో సుమారు 50 కి పైగా గృహాలు అమ్మకాలు జరిగినట్లు తెలుస్తోంది. నిర్మాణం పూర్తికాకుండా ఆగిపోయిన ఇండ్లు బేస్ మెంట్ లెవల్ 20 వేలు, లింటెల్ లెవల్ 50 వేలు, స్లాబ్ లెవల్ 80 వేలు నుండి లక్ష రూపాయలు వరకు అమ్మకాలు జరిగినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. రిటైర్డ్ తహశీల్దార్ లింగమహేశ్వరావు పదవీవిరమణ సందర్భంగా నివేశనా స్థలాలు, గృహాలు అమ్మకాలు జరిపి పొజిషన్ సరిఫికేట్స్ మంజూరు చేసినట్లు తెలుస్తోంది. రిటైర్డ్ తహశీల్దార్ అశోకవర్ధన్ పదవీవిరమణ సందర్భంగా గత ఫిబ్రవరి నెలలో రెవెన్యూ అధికారులు అవినీతికి పాల్పడి ఇంటి స్థలాలు కేటాయించడంపై లక్షల రూపాయలు చేతులు మారాయని ప్రింట్ మీడియాలో పెద్దఎత్తున వార్తా కథనాలు ప్రచురితం అయ్యాయి. సదరు ఆరోపణలపై ఉన్నతాధికారులు నామమాత్రపు విచారణ జరిపి రాజకీయ వత్తిడి కారణంగా బుట్టదాఖలు చేశారు.

- జర్నలిస్టుల ముసుగులో

చీరాల నియోజకవర్గంలో జర్నలిస్టుల కోటాలో చీరాలలో 3 సెంట్లు, వేటపాలెం లో దత్తక్షేత్రం కాలనీలో 6 సెంట్లు ఇంటి స్థలం ప్రకారం రెండు చోట్ల పొందడం గమనార్హం. గత పది సంవత్సరాలుగా రాజకీయ నాయకుల తాబేదార్లుగా వ్యవహరించిన కొందరు జర్నలిస్ట్ ముసుగులో అక్రమ పద్ధతుల్లో ఇంటి స్థలాలు పొందుతూ, కొందరికి మాత్రం ఇంటి స్థలం మంజూరు కాకుండా అడ్డుపడటంతో ఇటీవల బాధిత జర్నలిస్టులు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయడం జరిగింది. స్థలాల పంపిణీ మీద కూడా పూర్తి స్థాయిలో విచారణ జరగాల్సిన అవసరం ఉంది.

పంట కాలువల్లో చెత్తను తొలగించరూ..

విశాలాంధ్ర-అవనిగడ్డ : పంట కాలువల్లో చెత్తను, వ్యర్థాలను తొలగించలేదు. దివిసీమ వాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలో సుమారు 7,850 ఎకరాలు వరి సాగు జరుగుతుంది. పులిగడ్డ ఆక్విడేట్‌కు గత 5 సంవత్సరాల్లో ఏ విధమైన మరమత్తులు నిర్వహించకపోవడంతో క్షీన దశకు చేరుకుంది. గత సంవత్సరం ఆగష్టు నెల 25వ తేదీన ప్రస్తుత ఎం.ఎల్.ఎ మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ మరమత్తులు నిర్వహించాలంటూ రైతు దీక్ష నిమిత్తం రైతులకు పిలుపునిచ్చారు. అయినప్పటికీ అప్పటి ప్రభుత్వంలో ఏ మాత్రం మార్పు లేదు. ఈ పులిగడ్డ ఆక్విడేట్ క్రింద సుమారు 51 వేల ఎకరాలలో వరి పంట సాగు జరుగుతుంది. ప్రస్తుతం ఈ సంవత్సరం ప్రతి ఎకరానికి సాగు నీరు అందించేలా చర్యలు తీసుకుంటానని ఎం.ఎల్.ఎ మండలి బుద్ధప్రసాద్ హామీ ఇవ్వడం, ఆ దిశగా మండలి అడుగులు వేయడం జరుగుతుంది. కాలువల చివరి భూముల వరకు నీరు అందుతుందో లేదో అన్న విషయంపై రైతులకు మాత్రం ఆందోళనగానే ఉంది.

నారు పోసేదెలా..?

♦మిర్చి రైతుల ఆందోళన

♦పంట అమ్ముకోలేక, పెట్టుబడి పెట్టలేక రైతులు తీవ్ర అవస్థలు

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : సీజన్ వచ్చేసింది. ఈ ఏడాది మిర్చి నారు పోసేదెలా..? అని మిర్చి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది రైతులకు కనరాని నష్టాలు వచ్చాయి. దీంతో ఈ ఏడాది ఎలా ముందుకు పోవాలో రైతులు అర్థం కాక తలలు పట్టుకొంటున్నారు. గతేడాది సాగుచేసిన పంట ఈ ఏడాది పూర్తిగా అమ్ముడు పోలేదు. అయినప్పటికీ, మరోసారి పెట్టుబడుల సాగుకు సిద్ధం కావాలంటే రైతులు వెనుకడుగువేస్తున్నారు. ఈ ఏడాది మిర్చి నారు పోసే సీజన్ ప్రారంభం అవుతోంది. అవకాశం ఉన్న రైతులు బావుల కింద సొంతగా నారు పోసుకుంటారు. అలాగని మరికొంత మంది రైతులు నర్సరీలకు మిర్చి గింజలు ఇచ్చి నారు పెంచుకుంటారు. అయితే గతేడాది మిర్చి పైరు రైతులను కానరాని దెబ్బకొట్టింది. సరైన వర్షపాతం లేకపోవడంతో ట్యాంకర్లతో నీటిని తోలి పంటను కాపాడుకున్నారు. అయినప్పటికీ, ఆశించిన స్థాయిలో దిగుబడులు రాలేదు. దిగుబడులు తగ్గినా... ధరలు ఆశాజనకంగా ఉంటే ఖర్చులు వస్తాయని ఆశించిన రైతాంగాన్ని అవి కూడా వెక్కిరించాయి. సగానికి సగం పడిపోవడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి నెలకొంది. కూలీ ఖర్చుల కోసం పండిన పంటలో కొంత తెగనమ్ముకున్నా.... ధరలు వస్తాయన్న ఆశలో మిగిలిన పంటను రైతులు నిల్వ చేసుకున్నారు. అయితే మరోసీజన్ ప్రారంభం అవుతున్నా.. ధరలు రాలేదు. దీంతో ఈ ఏడాది పెట్టుబడులు ఎలా వస్తాయా..? అని రైతులు మదనపడుతున్నారు. జిల్లాలో ఏటా ఇంచుమించు 50 వేల ఎకరాల మిర్చి

సాగు ఉంది. దీనిలో గుండ్లకమ్మ ప్రాజెక్టు కిందే 15 వేల ఎకరాలు సాగవుతుంది. ఈ పంట సాగుకు ఎకరానికి నికరంగా రూ.2 లక్షల వరకు పెట్టుబడి అవుతుంది. ఇంతా పెట్టుబడిపెట్టక కనీసం ఎకరాకు 20 క్వింటాళ్ల నాణ్యమైన పంట దిగుబడి వస్తే రైతులకు గిట్టుబాటు అవుతుంది. అయితే గతేడాది ఆ పరిస్థితి లేదు. ఎల్నినో ప్రభావంతో ఆశించిన వర్షాలు పడలేదు. దీంతో రైతులకు పెట్టుబడులు పెరిగాయి. పంటకు నీరందించడానికి ట్యాంకర్లతో నీటిని అందించారు. దీంతో ఖర్చులు పెరిగాయి. ఇక గుండ్లకమ్మ ప్రాజెక్టు పరిధిలో రైతులు సొంతగా బావులు కొట్టించి మరీ నీరందించారు.

తగ్గిన ధరలు :

ఈ ఏడాది మిర్చి ధరలు గణనీయంగా తగ్గాయి. పంటకు ఎగుమతి లేక ధరలు తగ్గాయి. రైతులు అధికంగా సాగు చేసే తేజా వెరైటీ గతంలో రూ.23వేల ఉండగా, ప్రస్తుతం రూ.16 వేలు ఉంది. నంబరు-5 రకం రూ.20,000 గతంలో ఉండగా, ప్రస్తుతం రూ.13,000 ఉంది. 355 బేడిగరకం రూ.32,000 ఉండగా, ప్రస్తుతం రూ.12వేలకు చేరింది. 5531 బేడిగ రకం రూ.25,000 ఉండగా, ప్రస్తుతం రూ.11,000కు పడిపోయింది. ఇవే రకాలు ఒక ఏడాది పాతవైతే ప్రతి క్వింటాకు మరో రూ.2 వేలు తగ్గించి దళారులు కొనుగోలు చేస్తున్నారు. ఈ ధరకు అమ్మి నష్టాన్ని మూటగట్టుకోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

గుండ్లకమ్మపై దృష్టిసారించేనా :

నాటి వైసీపీ హయాంలో గుండ్లకమ్మ ప్రాజెక్టు వైసీపీ నేతలకు కల్పతరువుగా మారింది. ఆ ప్రాజెక్టులో యథేచ్ఛగా ఇసుక దోపిడి జరిగింది. ఈ నేపథ్యంలోనే గుండ్లకమ్మగేట్లు విరిగిపోయినా, నాటి వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. అధికారులు దీనిపై నిర్లక్ష్యపు సమాధాలు చెప్పుతూ సమస్యను దాటవేశారు. నాడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ ఈ ప్రాజెక్టుపై గట్టిగానే గళం వినిపించింది. గుడ్లకమ్మ ప్రాజెక్టును వైసీపీ పట్టించుకోలేదని ప్రజలు కూడా పూర్తిగా విశ్వసించారు. దీంతో ఈ ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల్లోని రైతులు వ్యవసాయ కార్మికులు ఆశించిన దానికంటే టీడీపీకి ఎక్కువ ఓట్లే వేసి పట్టంగట్టారు. టీడీపీ హయాంలో గుండకమ్మ జలసిరులు అందిస్తుందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే టీడీపీ నేతలు మాత్రం దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదు. కొత్తగా ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో నీరు మరో ఏడాది సముద్రం పాలుకాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

సాంబయ్య సేవలు మరువలేనివి

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : సీపీఐ నేత యరజర్ల సాంబయ్య సేవలు మరువలేనివని సీపీఐ సీనియర్ నాయకులు టిసిహెచ్ చెన్నయ్య అన్నారు. శనివారం యర్రగొండపాలెంలోని సీపీఐ కార్యాలయంలో యరజర్ల సాంబయ్య 10వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ నాయకులు వై వెంకట శివయ్య అధ్యక్షతన జరిగిన సభలో చెన్నయ్య మాట్లాడుతూ సాంబయ్య లైన్‌మెన్‌గా పనిచేస్తూ కమ్యూనిస్టు పార్టీలో పేద ప్రజల సమస్యల కోసం నిరంతరం పోరాడారని అన్నారు. 1983లో కామ్రేడ్ పూలసుబ్బయ్య గెలుపు కోసం యనలేని కృషి చేశారన్నారు. పేద ప్రజల సమస్యల కోసం నిరంతరం పోరాడారని అన్నారు. ఈ సభలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కెవి కృష్ణ గౌడ్, సీపీఐ త్రిపురాంతకం మండల కార్యదర్శి బాజాల రామయ్య, మొగిలి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ కార్పొరేటర్ చేరిక

విశాలాంధ్ర-సంతనూతలపాడు : ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలోని పేర్న మిట్ట 40 డివిజన్ కి చెందిన తెళ్ల చంద్రశేఖర్ శనివారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ సమక్షంలో తన కార్యాలయంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు, దామచర్ల జనార్ధన్ టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు ప్రజలకు ఎల్లప్పుడుఅందుబాటులో ఉండి అంకిత భావంతో ఉంటూ టీడీపీకి అభివృద్ధి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేమూరి మాల్యాద్రి టి బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

కౌలురైతు గుర్తింపు కార్డుల కోసం గ్రామసభలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని 21 గ్రామ పంచాయతీలోని గ్రామాలలో కౌలు రైతులను గుర్తించేందుకు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు వ్యవసాయ అధికారి మహ్మద్ ఫరూక్ తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 15 నుండి 29వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కౌలు రైతులను గుర్తించేందుకు వి ఏ ఏ, వీఆర్వోలు సంయుక్తంగా గ్రామాల్లో తిరిగి గుర్తించడం జరుగుతుంది అన్నారు. 15వ తేదీ పులిపాడు, బృందావనం, 16న కెల్లంపల్లి, బసవాపురం 18న పెద్దఉల్లగల్లు, చిన్న ఉల్లగల్లు 19న వేముల, వేముల బండ 20న కొమ్మవరం,ఈదర 22న భీమవరం, పూరిమెట్ల 23న జమ్మలమడక, మారెళ్ళ 24న ఉమామహేశ్వరపురం. తమ్మలూరు 25న తూర్పు కంభంపాడు, బట్లపల్లి, సుంకిరెడ్డిపల్లి 26న చింతలపూడి, పసుపుగల్లు 27న శంకరాపురం, పోలవరం 29న సింగనపాలెం, ముండ్లమూరు, వేంపాడు, గ్రామాలలో గ్రామ సభలు జరుగుతాయన్నారు. పొలాలను కౌలుకు తీసుకున్న రైతులు సభలకు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మత సామరస్యానికి ప్రతీక మొహ్రరం

విశాలాంధ్ర-గిద్దలూరు : మత సామరస్యానికి ప్రతీకగా హిందువులు ముస్లీంలు కలసిమెలసి నిర్వహించే ఏకైక పండుగ మొహరం.ఈ మొహరం వేడుకలను అనాదిగా నిర్వహించటం ఆనవాయితీగా వస్తున్న ఆచారం ఈసాంప్రదాయం నేటికి అట్లే కొనసాగుతుండటం మత సామరస్యానికి ప్రతీకగా నిలిచింది.ఇస్లాం మత స్థాపకుడు మహుమ్మద్ ప్రవక్త మానవాళికి ఇమామే వాసన్ ఇమామే ఖాసీం వంశీయుల త్యాగానికి ప్రతీకగా ఈ మొహరం వేడుకలను హిందూ ముస్లీమ్ సోదరులు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు.ఆయా పీర్ల చావిళ్ళలో ముజావర్లు పూజారులు గా వ్యవహరిస్తూ హిందూ,ముస్లీంలు సమర్పించే పానకం,చక్కెర,మరమరాలు ఆయాదేవతాపీర్లకు చదివింపులు చేస్తారు.ఈ మొహరం వేడుకలు ఒక్కో గ్రామంలో వారి అనుకూల సమయాల్లో పండగ నిర్వహిస్తుంటారు.ఇందులో చిన్న సరిగేసు,పగలు సరిగేసు,పెద్ద సరిగేసు నిర్వహిస్తారు.ఈవేడుకల్లో దేవతా పీర్లను సర్వాంగసుందరంగా అలంకరిస్తారు.ఈపీర్లను ఎత్తుకునే వారు శిరస్నానం చేసి భక్తి భావంతో ఎత్తుకుంటారు.ఈవేడుకల సందర్భంగా చావిడి ముందు గుండం త్రవ్వటం అందులో పెద్ద పెద్ద కర్రలు,మొద్దులు వేసి కాలుస్తారు.కాలుతున్నా గుండంలో పీర్లతో అటు ఇటు తిరుగుతారు. ఈ దృశ్యం గగుర్పాటు కలిగిస్తుంది.గిద్దలూరులో రెండు పీర్ల చావిళ్ళు ఉన్నాయి.ఇందులో సర్కార్ చావిడి మరొకటి,ఖాదర్ వలి స్వామిచావిడి ఇక్కడ ఖాదర్ వలి స్వామి ని అత్యంత భక్తి శ్రద్ధలతో ఆరాధిస్తారు.సర్కార్ చవిడిలో దస్తగిరి,మహబూబ్ సుభాని స్వామి ప్రతీతి ఈ

స్వాములకు చదివిపులు జరుగుతాయి.ప్రధానంగా ఖాదర్ వలి స్వామి కి ప్రత్యకత ఇక్కడచోటు చేసుకుంది.మొహరం వేడుకలలోనే కాకుండా ఈస్వామికి ప్రత్యేకంగా ఉరుసు మహోత్సవాలు నిర్వహిస్తారు.ప్రతి శుక్రవారం ఈ స్వామి ని వేలాదిమంది హిందూ,ముస్లీమ్ భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు.మొహరం సందర్భంగా ఖాదర్ వలి స్వామి చావిడి వద్ద పెద్దఎత్తున చేరిన జన సమూహామ్ మధ్యలో ఊరేగుతూ భక్తులకు ఆశీస్సులు అందిస్తూ మొక్కులు స్వీకరిస్తుంటారు.ఈసందర్భంగా స్వామిపై మరమరాలు ఘట్టాలు చల్లుతూ భక్తి ప్రపత్తులు చాటు కుంటారు.మొహరం వేడుకలు మండలంలో ఎన్ బయనపల్లి,ముండ్లపాడు తదితర ప్రాంతాల్లో వైభవంగా నిర్వహిస్తారు.వేడుకల్లో చివరి రోజున అంటే పీర్లు నీళ్ల లో పడేరోజు అంటారు.ఆ సమయంలో మత సామరస్యాన్నీ చాటుతూ ప్రతీకగా నిలవడం ఇక్కడ అనాదిగావస్తున్న ఆచారం.నేటికి ఆదే కొన సాగటం విశేషం.

కందులను పరామర్శించిన ముత్తుముల

విశాలాంధ్ర-గిద్దలూరు : మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ఇటీవల కాలికి చికిత్స చేయించుకుని ఆయన నివాస గృహంలో విశ్రాంతి తీసుకుంటుండగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి శనివారం ఆయనను పరామర్శించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కందులను పరామర్శించే వారిలో మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి,

యర్రగొండపాలెం టిడిపి ఇన్చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు తదితరులు ఆయనను పరామర్శించారు.

ప్రభుత్వ వైద్యశాలకు బాడీ ఫ్రీజర్ బాక్స్

విశాలాంధ్ర-కొమరోలు : కొమరోలు మండలం లోని చుట్టుపక్కల గ్రామాలకు ఉచితంగా డెడ్ బాడీ ఫ్రీజర్ బాక్స్ దివ్య హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వారు ప్రభుత్వ వైద్యశాలకు ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల చైర్మన్ కామూరి అమూల్య శ్రీనివాసరెడ్డి, డాక్టర్ చైతన్య దీపక్‌ల చేతుల మీదుగా శనివారం ప్రారంభించడం జరిగింది. దివ్య హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు లొక్కు శరత్ బాబు మాట్లాడుతూ ఈ బాక్స్‌ను మెయింటెనెన్స్ ఖర్చు కోసం 500 రూపాయలు ఇవ్వాలని నిర్ణయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీమ్ సభ్యులు లొక్కు శరత్ బాబు కారుమంచి చిన్న పీరయ్య, సిద్దయ్య, సునీల్ కుమార్ నాయుడు, సుమన్, రామ్ మోహన్, బెంజిమెన్, అంజి, చెన్నయ్య పాల్గొన్నారు.

ముగిసిన పొగాకు వేలం

విశాలాంధ్ర-టంగుటూరు : టంగుటూరు పొగాకు బోర్డు వేలం కేంద్రంలో 2023-24 సీజన్ శనివారంతో ముగిసిందని పొగాకు బోర్డు వేలం నిర్వహణ అధికారి ఏ శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సీజన్లో పొగాకు అమ్మకాలు 96 రోజులు జరగగా 9.91 మిలియన్ల పొగాకు అమ్మకం జరిగిందన్నారు. వేలం లో 2869 మంది రైతులు, కొనుగోలుకు 42 కంపెనీలు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం 10 మిలియన్ల పొగాకు కొనుగోలుకు అనుమతించగా 9.91 మిలియన్ల పొగాకు అమ్మకం జరిగిందన్నారు.

ప్రసాద్‌రావును పరామర్శించిన బైరెడ్డి, దారపనేని

విశాలాంధ్ర-పామూరు : కనిగిరి పట్టణానికినికి చెందిన చీమలమర్రి ప్రసాద్‌రావును శనివారం కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు మాజీ సింగిల్ విండో అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డిలు పరామర్శించారు. ఇటీవల ప్రసాద్‌రావు అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం చేయించుకొని సంపూర్ణ ఆరోగ్యంతో కనిగిరి పట్టణంలోని తమ స్వగృహానికి చేరుకున్నారు. సమాచారం తెలుసుకున్న బైరెడ్డి, దారపనేనిలు పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విశ్రాంత ఉద్యోగిగా ఉంటూ కీర్తిశేషులు ఇరిగినేని తిరుపతి నాయుడుకు ప్రత్యేక సలహాదారుగా ప్రసాదరావు అందించిన సేవలను గుర్తు చేశారు.

అగ్రిగోల్డ్ బాధితులు సమస్యలను పరిష్కరించాలని మంత్రికి వినతిపత్రం

విశాలాంధ్ర-సింగరాయకొండ : శనివారం ఉదయం సింగరాయకొండ, టంగుటూరు ప్రాంతాలలోని అగ్రిగోల్డ్ బాధితులు సమస్యలను పరిష్కరించాలని కొండెపి నియోజక వర్గం ఎమ్మెల్యే సాంఘిక సంక్షేమం, వయోవృద్ధులు సంక్షే మం, సచివాలయం విలేజ్ వాలంటీర్ శాఖా మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి శనివారం మర్యాదా పూర్వ కంగా కలిసి అగ్రిగోల్డ్ బాధితుల తరుపున వారి సమస్యలు ముఖ్యమంత్రి తెలియచేసి వారి సమస్యలను పరిష్కరించి బాధితులను ఆదుకోవాలని వినతి రాష్ట్ర అగ్రిగోల్డ్ కమిటీ ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ప్రసాదరావు, చంద్రరమేష్ రామకృష్ణ, శ్రీనివాసులు, నాగేంద్ర, రమణయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

-ప్రభుత్వం అట్రాసిటీ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి

- డి హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరువది సుబ్బారావు డిమాండ్

విశాలాంధ్ర-ఒంగోలు : ఆదోని మండలం లోని నాగనాతనహళ్లి గ్రామానికి చెందిన దళిత మహిళ గుండమ్మను ట్రాక్టర్‌తో తొక్కించి దారుణంగా హత్య చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి (డి హెచ్ పి ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తాను కొనుగోలు చేసిన భూమిపై కూడా హక్కు లేదంటే అధికార పార్టీకి చెందిన నేత ఇలాంటి చర్యలకు పాల్పడం దుర్మార్గమన్నారు.

అధికారంలోకి రాకముందు టిడిపి నేతలు దళితుల ప్రభుత్వం వస్తుందని చెప్పారని, అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపైనే మారణకాండ సృష్టించటం దుర్మార్గమన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా దళితులపై హత్యలు, అత్యాచారాలు, దాడులు తగ్గటం లేదన్నారు. నూతనంగా ఏర్పడిన తెలుగుదేశం ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని కఠినంగా అమలు చేసి డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలని, రక్షణ కల్పించాలని,అలాగే నిందితులను అరెస్టు చేసి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బాలబాలికల వసతి గృహాలు తనిఖీ

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : మండలంలోని హాస్టళ్లను, మరియు ఆశ్రమ పాఠశాలలో జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సురేష్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే మండల కేంద్రమైన బాలుర వసతిగృహము, ఐనముక్కల వద్ద గల బాలికల వసతి గృహాన్ని తనిఖీలు నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సురేష్ పెద్ద దోర్నాల మండలం లోని చింతల, కొర్రప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంల పరిధిలోని పెద్ద దోర్నాల, ఐనముక్కల, కొర్రప్రోలు, చింతల ఏపీ టి.డబ్ల్యు ఆర్ ఎస్ పాఠశాలలను సందర్శించడం జరిగింది. ఈ సదర్భంగా పాఠశాల నందలి విద్యార్థుల ఆరోగ్య స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల నందు పరిశుభ్రత పరిశీలించి అధ్యాపకులకు సూచనలు ఇవ్వటం జరిగినది. విద్యార్థుల ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అనారోగ్య లక్షణాలు ఉన్నచో వెంటనే ఆరోగ్య సిబ్బందికి కానీ వైద్యాధికారులకు తెలియ చేయాలని తెలియ చేశారు. వైద్య సిబ్బందికి తరచూ రెసిడెన్షియల్ పాఠశాలలు ను తరచూ సందర్శించి విద్యార్థుల ఆరోగ్య

స్థితి నీ తెలుసుకోవలసింది గా సూచించారు. పాఠశాల లో పెండింగ్ ఉన్న సికిల్ సెల్ అనిమియ పరీక్షలు నూరు శాతం పూర్తి చేయాలని, అలాగే ఆన్ లైన్ కూడా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చింతల,కొర్ర ప్రోలు వైద్యాధికారులు డాక్టర్.యం. యాగ్నిక్,డాక్టర్.ఆర్.సాయి ప్రశాంతి, ఏ.శంకర్ రెడ్డి, డాక్టర్. టి. లక్ష్మీ నారాయణ, పి.హెచ్.యన్. వి. సూర్య కుమారి, సూపర్ వైసర్ కే.పద్మావతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.అలాగే చింతల వైద్యశాలను కూడా పరిశీలించారు. వసతి గృహాలు పరిశీలించి, వంట గదులను, పరిసరాల పరిశుభ్రతను పరిశీ లించారు. అలాగే విద్యార్థులు తాగే నీటిని పరిశీలించారు. సీజర్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. డెంగ్యూ ,మలేరియా పైలేరియా, చికెన్ గున్యా సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దోమల ద్వారా వ్యాపించు ఐదు రకాల వ్యాధుల గురించి తెలియజేశారు. దోమలు లేకుండా ,దోమలు పెరగకుండా, చూసుకోవాలన్నారు. దోమల నివారణకు దోమతెరలు వాడాలని, పరిసరాలు పరిశుభ్రత, భోజనానికి ముందు తరువాత చేతులను కడుకోవాలని విద్యార్థులకు తెలియజేశారు. అలాగే పరిసరాల పరిశుభ్రతతో పాటు, వ్యక్తిగత పరిశుభ్రత కూడా చాలా ముఖ్యమైన తెలియజేశారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ఉపయోగించేది ట్యాంకులను, ఎప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలని తెలియజేశారు. అలాగే మండలంలోని, కొర్రపోలు వైద్యశాలను పరిశీలించారు. చింతల వైద్యాధికారులు డాక్టర్ యాగ్నిక్, డాక్టర్ సాయి ప్రశాంతి, డాక్టర్ శంకర్ రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితులు అరెస్టు

విశాలాంధ్ర-బేస్తవారిపేట : బేస్తవారిపేట మండల పరిధిలో ఇటీవల జరిగిన వరుస చోరీ కేసుల్లో నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ రామకోటయ్య తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎస్సై బి. నరసింహారావుతో కలిసి కేసుల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పాపాయిపల్లికి చెందిన కత్తి రోహిత్ అనే వ్యక్తి ఈ నెల 1వ తేదీన మండలంలోని పూసలపాడు గ్రామ బస్టాండ్ సమీపంలోని ఆర్ ఆర్ కాలనీలో ఇనుప గేట్లు, ఇనుప పైపులు, 2న అదే కాలనీలో స్లాబ్ కోసం ఉపయోగించే ఒక టన్ను ఇనుప రాడ్లు, 6వ తేదీన బేస్తవారిపేటలోని రైతు భరోసా కేంద్రం తాళాలు పగులగొట్టి ఒక టీవీ, 5 సీలింగ్ ఫ్యాన్లు, గ్యాస్ పొయ్యి, గ్యాస్ సిలిండర్, రైస్ కుక్కర్, కరెంట్ ఫీజులు వంటి సామాన్లు దొంగతనం చేసి వాటిని స్థానిక సాయిబాబా గుడి సమీపంలోని పాడు బడిన రేకుల షెడ్డులో దాచాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు జిల్లా ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ ఆదేశాల మేరకు మార్కాపురం డీఎస్పీ బాల సుందర రావు, కంభం సీఐ రామకోటయ్య ల పర్యవేక్షణలో ఎస్సై నరసింహారావు కేసును దర్యాప్తు చేసి, పై మూడు కేసుల్లో ముద్దాయి రోహిత్ ను శనివారం సాయిబాబా గుడి సమీపంలో అరెస్ట్ చేసి, చోరీ సొత్తును స్వాదీన పరుచుకున్నట్లు తెలిపారు. అలాగే రూ. 70,000ల విలువ గల రైతులకు సంభందించిన కేబుల్ వైర్, శంకర్ రెడ్డి కాలేజ్ కి చెందిన ఫెన్సింగ్ వైరు, మోటార్ రాగి వైరు వంటి మరో మూడు చోరీ కేసుల్లో బాపట్ల జిల్లా మార్టూరు గ్రామానికి చెందిన చిన్నకత్తుల ఇశ్రాయేలును, రూ. 1,20,000 ల విలువైన మరో టీవీ చోరీ కేసులో కడప జిల్లా కలసపాడు మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన బొమ్మి కాశయ్యను అరెస్ట్ చేసి, వారు చోరీ చేసిన వస్తువులను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. వారం రోజుల్లోనే 7 దొంగతనం కేసుల్లో ముగ్గురు ముద్దాయిలను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి రూ. 2,90,000 ల విలువ గల చోరీ సొత్తును సీజ్ చేసిన ఎస్సై నరసింహారావు, సిబ్బందిని ఎస్పీ, డీఎస్పీలు అభినందించినట్లు సీఐ చెప్పారు. యువత చెడు అలవాట్లకు బానిసలు కాకుండా మంచి మార్గంలో నడవాలని సూచించారు.

ఘనంగా సుబ్బయ్య జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మండలంలోని ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన పాస్టరు తెలగతోటి సుబ్బయ్య 70వ జన్మదిన వేడుకలు శివ బైక్ మెకానిక్ ఆధ్వర్యంలో శనివారం గ్రామస్తులు ఘనంగా నిర్వ హించారు. తొలిత కేక్ కట్ చేసి జన్మదిన శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బి ఎన్ విజయకుమార్ ఫోన్‌లో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్య కర్తలు జనసేన నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

అమ్మవారికి ఆషాడ సారె సమర్పణ

విశాలాంధ్ర-అవనిగడ్డ : సీతమ్మ అమ్మవారికి ఆషాడ సారె సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో సమర్పించారు. అవనిగడ్డ సివారు బందలాయి చెరువులో వేంచేసి ఉన్న సీతమ్మ అమ్మ వారికి శనివారం పోతరాజు స్వామి వారి దేవస్థానం నుండి మేళ తాళాలతో ఊరేగింపుగా సీతారా మాంజ నేయ స్వామి వారి దేవస్థానానికి వెళ్లి భక్తి శ్రద్ధలతో అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, సారె, చలివిడి తదితర పదార్థాలను ఆలయ నిర్వాహకులు సింహాద్రి రామలింగేశ్వరరావు దంపతులకు అందచేశారు. సబ్ డివిజన్ కన్వీనర్ సుబ్బారావు భక్తులు పాల్గొన్నారు.

కారంచేడు నరమేధానికి నిరసనగా

17న స్మారక సభలు జరపండి

దళిత నేత నీలం నాగేంద్రరావు పిలుపు

విశాలాంధ్ర-ఒంగోలు : దళిత ఉద్యమానికి ఊపిరిగా నిలిచి, విప్లవోద్యమం కులాన్ని అంగీకరించేలా చేసిన కారంచేడు మారణ హోమంలో అమరులైన దళితులకు నివాళిగా ఈ నెల 17న స్మారక సభలు నిర్వహించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు పిలుపునిచ్చారు. శనివారం ఒంగోలులోని తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కారంచేడు నరమేధంలో అసువులు బాసిన మాదిగల నెత్తుటి ధార దళిత ఉద్యమానికి నాంది పలికిందన్నారు. 1985 జూలై 17న కారంచేడు కమ్మ కులస్తుల దాడిలో పందలాదిమంది గాయపడ్డారని, దుడ్డు వందనం, దుడ్డు రమేశ్, తేళ్ళ మోషే, తేళ్ళ ముత్తయ్య, తేళ్ళ యెహోషువా, దుడ్డు అబ్రహాంలు మరణించారన్నారు. ఈ మారణ హోమంతో రగిలిపోయిన దళిత



బహుజనులు ఆత్మగౌరవం కోసం దళిత మహాసభను ప్రకటించారన్నారు. కారంచేడు మారణ హోమం తరువాత మాల, మాదిగ, కొందరు బహుజన యువకులు తమ చదువులు ఆపేసి, దళిత ఉద్యమం కోసం జీవితాలను త్యాగం చేశారన్నారు. ఈ దేశంలో కులం లేదు, ఉన్నది వర్గం మాత్రమే అని చెప్పిన పీపుల్స్ వార్ నక్సలైట్లు కారంచేడు మారణ హోమానికి కారణమైన దగ్గుబాటి చెంచురామయ్యను ఆయన ఇంటిలోనే కాల్చి చంపారన్నారు. కారంచేడు నరమేధం జరగక ముందు వరకూ కులం చెప్పుకోవడానికి బిడియపడ్డ ఎస్సీ ఎస్టీ బీసీ కులాలు కుల సంఘాల ఉద్యమాలను మొదలుపెట్టాయన్నారు. కారంచేడు మారణ హోమం నేపథ్యంలో ఉవ్వెత్తున ఎగిసిన దళిత ఉద్యమం భారతదేశంలోని దళితులకు ఆత్మస్థైర్యాన్ని ఇచ్చిందన్నారు. వాడవాడనా కారంచేడు మృతవీరుల, దళిత ఉద్యమకారుల స్మారక సభలు నిర్వహించాలని నీలం నాగేంద్రరావు పిలుపునిచ్చారు. మాల మహానాడు అధ్యక్షులు దారా అంజయ్య, దళిత నాయకులు కాకుమాను రవి, వర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళలకు సహృదయ ఫౌండేషన్ సంస్థ చేయూత

విశాలాంధ్ర-పర్చూరు: ఇంకొల్లు మండలంలోని వంకాయలపాడు గ్రామంలో ఉన్న ఆశ్రయ వృద్ధుల ఆశ్రమ సౌజన్యంతో గుర్తించిన పేద మహిళలకు రోటరీ ఆధ్వర్యంలో అమెరికాలోని సహృదయ ఫౌండేషన్ సంస్థ వారి రూ.25 వేల ఆర్థిక సహకారంతో ప్రతి మహిళకు రూ.2 వేల విలువగల 25 కేజీల బియ్యం బస్తా, నిత్యావసర సరకులను తాడివాక బిందు, వారి మిత్రుల సహకారంతో పంపిణీ చేశారు. అలాగే ఆశ్రమానికి పర్చూరుకు చెందిన ప్రముఖ న్యాయవాది రావి సత్యనారాయణ రూ.60 వేల విలువగల రెండు ఆక్సీమీటర్లను ఆసరా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఉపయోగపడేవిధంగా అందించారు. ఆయన మనవడు అధిరన్ పేరుమీద ఆశ్రమ అభివృద్ధికి రూ.10 వేల ఆర్థిక సహకారం అందించారు. చేయూత ఇచ్చిన సహృదయ సంస్థ, రావి సత్యనారాయణకు ఆశ్రమ నిర్వాహకులు భవనం శ్రీనివాసరెడ్డి, జయలక్ష్మి, సాయి ధన్యవాలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు తోకల కృష్ణమోహన్, కోమటి ఆంజనేయులు, ప్రతినిధులు సదానందరెడ్డి, శ్రీనివాసరావు, రాజగోపాలరెడ్డి ఉన్నారు.

దివ్యాంగులకు పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర-పర్చూరు: ప్రజాకూటమి ప్రభుత్వ పాలనలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో అంగవైకల్యం ఉన్నవారికి డాక్టర్ ఆంజనేయులు పరీక్షలు శనివారం ప్రారంభించారు. సదరన్ క్యాంప్ కొరకు ఇటీవల ప్రభుత్వం ధృవీకరణపత్రాల కొరకు నమోదు కార్యక్రమం ప్రారంభమైనది. నియోజక వర్గంలోని పరీక్షల కొరకు వచ్చిన వారికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ మామిడిపాక హరిప్రసాద్ దివ్యాంగులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. వారికి పండ్లు, స్వీట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. వీరివెంట పంచాయతీ ప్రాదేశిక సభ్యులు పఠాన్ మీరావలి తదితరులు ఉన్నారు.

ఆర్మ్‌స్ట్రాంగ్‌కు కొవ్వొత్తులతో నివాళి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : తమిళనాడు బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్మ్ స్ట్రాంగ్ ఇటీవల హత్యకు గురైన నేపథ్యంలో బాపట్ల నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ ఇంచార్జ్ గుదే రాజారావు ఆధ్వర్యంలో శనివారం కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాగిత కోటేశ్వరరావు వీసీకే పార్టీ జిల్లా అధ్యక్షులు రేగులగడ్డ చంద్రశేఖర రావు కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుదే రాజారావు మాట్లాడుతూ ఆర్మ్ స్ట్రాంగ్ ని హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని వారి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాలు ప్రజా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ రంగానికి చంద్రబాబు బాసట

టీడీపీ నాయకుడు శివరామకృష్ణ

విశాలాంధ్ర - రేపల్లె : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఉచిత ఇసుక విధానం ప్రతి పేదవాడి ఇంట పండుగేనని రేపల్లె టీడీపీ నాయకుడు వీరవల్లి శివరామకృష్ణ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానం ప్రతి భవన నిర్మాణ కార్మికుడి ఇంట వరంగా అభివర్ణించారు. ఉచిత ఇసుక విధానంతో నిర్మాణరంగం ఊపందుకుని రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు పెరుగుతాయని తెలిపారు. గత ప్రభుత్వ జీవోలను రద్దు చేస్తూ ఇసుక విధానాల్లో మార్పునకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకున్నారని వివరించారు. గృహ నిర్మాణదారులు ఇబ్బందులు పడకుండా ఉచిత ఇసుక విధానాన్ని అమలులోకి తెస్తూ ప్రభుత్వం జీవో నెంబర్ 43ను జారీ చేసిందన్నారు. రాష్ట్రంలో ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన సహజ వనరులపై హక్కులను ప్రజల పరం చేయడమే లక్ష్యంగా ఈ ఉచిత ఇసుక విధానాన్ని ప్రభుత్వం తెచ్చిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నో సార్లు ఆంక్షలు విధించినప్పటికీ వేటిని లెక్కచేయకుండా అక్రమ రీతిలో ఇసుకను కొల్లగొట్టారని ఆరోపించారు. ఇలాంటి సందర్భంలో రాష్ట్ర ఖజానాకి కొంత నష్టం కలిగినా, ప్రజలకు మరీ ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులకు, దినసరి కూలీలకు ఉపాధి లభించడానికి దోహదం చేస్తుందన్న సదుద్దేశంతో ఈ విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతానికి గనుల శాఖ అధికారులు మొత్తం 43 లక్షల టన్నుల ఇసుక ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారని తెలిపారు. ప్రజలే నేరుగా డిపో వద్దకు లారీ, ట్రాక్టర్ వంటి వాహనాలు తీసుకొని వచ్చి ఇసుకను తీసుకెళ్లవచ్చు అన్నారు. ఇసుక అవసరం ఉన్నవారు ఆన్‌లైన్‌లోనే బుక్ చేసుకునే ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. కొల్లూరు మండలం జువ్వలపాలెంలో ఒక టన్ను ఇసుక కేవలం రూ.197లకే అందుబాటులో ఉందన్నారు. ప్రభుత్వానికి ఇసుక మీద ఎలాంటి రాబడి లేకుండా కేవలం నిర్వహణ చార్జీలు, సీనరేజీ చార్జీలకు మాత్రమే ఇసుక అందిస్తుందన్నారు. సీనరేజీ చార్జీలను సైతం గ్రామపంచాయతీలకు అప్పగించే ఏర్పాట్లు ప్రభుత్వం చేస్తుందన్నారు. దీంతో స్థానిక సంస్థలు బలోపేతం అవుతాయి. గత ప్రభుత్వంలో ఆర్థిక సంఘం నిధులు సైతం పంచాయతీల ఖాతాల నుంచి మళ్లించడం చూశామన్నారు. స్థానిక సంస్థలకు నిధులు లేకుండా చేసి నిరసించిపోయేలా చేసింది వైసీపీ ప్రభుత్వమని దుయ్యబట్టారు. మళ్లీ వాటిని బలోపేతం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కలిసి ప్రజలకు మంచి పాలన అందిస్తారని చెప్పారు. ప్రజల మన్ననలను పొందేలా ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఆయన అన్నారు.

దేశ తొలి ప్రధానికి ఇచ్చే గౌరవం ఇదేనా..?

విశాలాంధ్ర - రేపల్లె : నేటి బాలలకు చాచాజీ అంటే తెలియకుండా రేపల్లె మున్సిపల్ పాలకులు, అధికారుల అత్యంత నిర్లక్ష్యంగా ప్రవర్తించటంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహం ప్రస్తుతం గత రెండు సంవత్సరాలుగా పట్టణంలోని నడిబొడ్డులో గల ప్రకాశం మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల ఆవరణలో ఎక్కడో ఒక మారు మూలన ముళ్లపదులు చెట్లలో ఉంచారు. భారతదేశానికి స్వాతంత్రం తీసుకురావడంలో గాంధీజీ, నెహ్రూజీ ప్రధాన పాత్ర పోషించిన సంగతి పాఠకులకు విధితమే. అయితే రేపల్లె రైల్వే స్టేషన్ దగ్గర గల రాతి విగ్రహం నెహ్రూ స్థానంలో కొత్తగా కాంస్య విగ్రహం నెలకొల్పే సమయంలో పురపాలక సంఘ పాలకులు, అధికారులు ఆ రాతి విగ్రహాన్ని తొలగించి ఓపెన్ థియేటర్లో గల ప్రకాశం మున్సిపల్ పాఠశాల ఆవరణలో మూలన పడవేసి చేతులు దులుపుకున్నారు. ఈ విగ్రహాన్ని స్కూలు ఆవరణలో దిమ్మ కట్టి ఏర్పాటు చేయాల్సి ఉండగా ముళ్ళ కంపలు చెట్ల పొదల్లో ప్రస్తుతం కనిపిస్తున్నది. నేటి బాల బాలికలకు భారత మాజీ ప్రధాని జవహర్లాల్ నెహ్రూ గురించి తెలియాల్సిన అవసరం ప్రస్తుత ఉపాధ్యాయులపై ఉంది. అయితే ఈ విగ్రహం ఆ పాఠశాల ఆవరణలో ఒక మూలనఉన్న సంగతి ప్రకాశం పాఠశాల ఉపాధ్యాయులకు కూడా తెలిసి ఉండకపోవడం గమనార్హం. ఇప్పటికైనా రేపల్లె మున్సిపల్ పాలకులు , అధికారులు స్పందించి ముళ్ళ పొదలలో ఉన్న నెహ్రూజీ విగ్రహాన్ని స్కూలు ఆవరణలో అందరకు కనిపించే విధంగా ఆ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అధికారులను కోరుతున్నారు.

కౌలు రైతులు కార్డులు తీసుకోవాలి

విశాలాంధ్ర-గిద్దలూరు : మండలంలోని అంబవరం, వెల్లుపల్లి, గిద్దలూరు, తిమ్మాపురం గ్రామాల్లో పంట సాగు హక్కు పత్రం (సీసీఆర్సీ)పై శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు.గిద్దలూరు మండల వ్యవసాయ అధికారి విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ కౌలుకి పొలాలు తీసుకొని సాగు చేసుకుంటున్న ప్రతి ఒక్క రైతు కౌలు కార్డులు తీసుకోవాలని తెలియజేసారు. పంట సాగు హక్కు పత్రం కాలపరిమితి 11 నెలలు మాత్రమే అని, దాని వలన భూ యజమానులకి ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. కౌలు దారులకు పంట మీద మాత్రమే హక్కు ఉంటుందని కానీ భూమి మీద ఎటువంటి హక్కు ఉండదన్నారు భూ యజమానులు కౌలు కి ఇవ్వడం లో ఎటువంటి అనుమానలు చెందవద్దని తెలిపారు. భూయజమానులు కూడా కౌలు రైతుల కి సహకరించాలని కోరారు.కౌలు కార్డులు తీసుకున్న రైతులు భూ యజమానులు తో పాటు ప్రభుత్వం ద్వారా వచ్చు అన్ని రకాల పథకాలకి అర్హులన్నారు. ముఖ్యంగా పంట నమోదు, పంటల భీమా, పంట నష్ట పరిహారం, కౌలు రుణాలు, ధాన్యం అమ్మకాలు, విత్తనాలు కొనుగోలు మొదలైనవి అన్ని పొందవచ్చునని తెలిపారు. కౌలుకి పొలాలు చేసుకొనే రైతులు భూ యజమాని ఆధార్ కార్డు, పట్టాదారు పాసుబుక్, కౌలు అగ్రిమెంట్, కౌలు దారు ఆధార్ కార్డు, ఫోటో, ఫోన్ నెంబర్ తీసుకొని గ్రామ రెవిన్యూ అధికారి లేదా గ్రామ వ్యవసాయ సిబ్బంది ని కలిసి కౌలు కార్డు పొందవచ్చునన్నారు అనంతరం కొన్ని కౌలు కార్డులు కూడా కౌలు రైతులకు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటయ్య, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, గ్రామ రెవిన్యూ అధికారులు అచ్చయ్య, ఈశ్వర్‌రెడ్డి, పద్మ, పద్మావతి, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు శేఖర్, నూర్, కాసిం, సుభాని కౌలు రైతులు పాల్గొన్నారు.

ఇంటింటికి విస్తృత సర్వే

విశాలాంధ్ర-తాడేపల్లి : మంగళగిరి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఏ.శ్రీమన్నారాయణ స్థానిక హెల్త్ సెక్రటరీ, ఆశ వర్కర్స్ శనివారం పెనుమాక గ్రామంలో జ్వరం కేసులు అని మీడియా వార్తలకు స్పందించి విస్తృతంగా ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించారు. స్థానికుల సమాచారం ఇంటింటికి తిరిగి సేకరించిన సమాచారాన్ని బట్టి తొలకరి వర్షాలకి తడవడం మూలాన వచ్చిన జలుబు, దగ్గు మొదలైన లక్షణాలుగా అధికారులు గుర్తించారు. వెంటనే స్పందించిన అధికారులకు పెనుమాక గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

సమన్వయంతో మెరుగైన విద్యుత్ సరఫరా చేయాలి

విశాలాంధ్ర-అద్దంకి: వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా చేరు విధంగా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని విద్యుత్‌శాఖ అద్దంకి డివిజన్ ఈఈ ఎన్.మస్తాన్‌రావు అన్నారు. శనివారం స్థానిక గీతామందిరం నందు విద్యుత్‌శాఖ అద్దంకి డివిజన్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క సిబ్బంది పూర్తి స్థాయిలో క్రమశిక్షణతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా వినియోగదారులకు మరింత చేరువకావాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయాలను గణనీయంగా తగ్గించుటకు సిబ్బందికి తగు సూచనలు అందజేశారు. సిబ్బంది అందరూ విద్యుత్ లైన్లను తరచుగా పరిశీలించి వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసే విధంగా సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో డీఈఈ సత్యన్నారాయణ, ఏఈలు, లైన్‌మెన్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాలూకా ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర-అద్దంకి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అద్దంకి తాలూకా నూతన కార్యవర్గ ఎన్నిక స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో శనివారం జరిగింది. తాలూకా ప్రెసిడెంట్‌గా ఆర్.అమర్‌నాథ్, కార్యదర్శిగా కె.చెంచయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కె.వెంకటకృష్ణలను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షులు కె.రోశయ్య, పి.శ్రీనివాసరావు వ్యవహరించారు.

పెనుమాకలో వింత వ్యాధులు

విశాలాంధ్ర-తాడేపల్లి : పెనుమాకలో వింత వ్యాధులు జ్వరాల బాడిన పడి పెయిన్స్ జాయింట్ పెయిన్స్‌తో ఇబ్బందులు పడుతున్నారు. గత వారం రోజుల నుంచి ప్రజల్లో వ్యాధులు నడవలేక వ్యాధి గ్రస్తులు ఇబ్బందులుపడుతున్నారు. సీజనల్ వ్యాధులా మరేదైనా కొత్త వ్యాధులా అనేది డాక్టర్లు కనిపెట్టలేకపోతున్నారు. మెడికల్ క్యాంపులు ఏర్పాట్లు చేసి వ్యాధులు నయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన పెను ప్రమాదం

విశాలాంధ్ర - చీరాల : ఇంకొల్లు నుంచి చీరాల వస్తున్న ఆర్టీసీ బస్సు చీరాలలోని ముంతావారి సెంటర్లో ప్రమాదవశాత్తు పెద్ద శబ్దంతో మబ్ విరిగిపోయి చక్రం ఊడిపోయింది. అప్రమత్తంగా వ్యవహరించి డ్రైవర్ ఈశ్వర రెడ్డి బస్సును ఆపి వేయడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాలలోకి వెళితే ఇంకొల్లు నుంచి చీరాల వస్తున్న ఆర్టీసీ బస్సు ప్రమాదవశాత్తు పెద్ద శబ్దంతో మబ్ విరిగిపోయింది. ప్రమాదాన్ని ముందుగానే గుర్తించిన డ్రైవర్ అప్రమత్తమయ్యి బస్సును నిలిపివేశాడు. తక్షణమే డిపో మేనేజర్ శ్యామలకు సమాచారం ఇవ్వగా ఘటన జరిగిన ప్రదేశానికి వచ్చి బస్సులో ఉన్న 15 మంది ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా మరో బస్సు ఏర్పాటు చేసి తరలించారు. డిపో మేనేజర్ శ్యామల కుమారి డ్రైవర్ ఈశ్వర రెడ్డి నుంచి వివరాలు సేకరించి, ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్యామల మాట్లాడుతూ చక్రంలోని ఇనప మబ్ ఊడిపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని వెళుతున్న బస్సు నుంచి ఒక్కసారిగా టైరు ఊడిపోవడంతో అటు ప్రయాణికులతో పాటు రోడ్డుపై ఉన్న ప్రజలు భయందోళన చెందారని ఎటువంటి ప్రమాదం జరగలేదని అంతా క్షేమంగా ఉన్నారని తెలిపారు.

శ్రీ వీరాంజనేయస్వామి వారికి గజమాల సమర్పించిన భక్తుడు

విశాలాంధ్ర-పొన్నూరు : పొన్నూరు పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ వీరాంజనేయ స్వామి 24 అడుగుల ఏకశిల ప్రతిమకు శనివారం ప్రకాశం జిల్లా పొదిలి గ్రామానికి చెందిన తెల్లమేకల హనుమంతరావు రిటైర్డ్ డ్రైవర్(ఆర్టీసీ) రూ.30 వేలు ఖర్చుతో ప్రత్యేక ఎర్ర గులాబీలతో గజమాల చేయించి స్వామివారికి సమర్పించారు. వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు చేసి స్వామి వారి మెడలో అలంకరించారు. ఆలయ ఈవో తుల్లిమిల్లి శ్రీనివాస్ హనుమంతరావును అభినందించారు.

ముగిసిన 4వ గణిత విభాగం అంతర్జాతీయ సదస్సు

విశాలాంధ్ర-తాడేపల్లి : కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో నాలుగవ అంతర్జాతీయ గణిత విభాగ సదస్సు శనివారం ఘనంగా ముగిసింది. ఈ సదస్సుకు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చీఫ్ జనరల్ మేనేజర్(టెక్నికల్) డాక్టర్ జి.రవి ముఖ్యఅతిథిగా హాజరై ఇంజినీరింగ్‌లో గణితం ఆవశ్యకతను ఇతర విభాగాలతో అనుసంధానమైన సమస్యల మీద ప్రసంగించారు. పంజాబ్‌లోని జలంధర్‌లోని ఎన్ఐటిలోని మ్యాథమెటిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.శివరాజ్ మాట్లాడుతూ మెషిన్ లెర్నింగ్ అప్లికేషన్‌ల ద్వారా జీట్, మాస్ ట్రాన్స్‌ఫర్‌పై పరిశోధన పత్రాన్ని సమర్పించారు. కేరళ విశ్వవిద్యాలయం, కేరళలోని గణితశాస్త్ర ప్రొఫెసర్ డాక్టర్ సురేష్ సింగ్ సమాచార సిద్ధాంతంపై ప్రసంగం చేశారు. పోస్ట్ లంచ్ సెషన్‌లో, ప్రతినిధులందరూ హైబ్రిడ్ మోడ్ ద్వారా తమ పరిశోధన ఫలితాలను సమర్పించారు. తమిళనాడులోని సవీత విశ్వవిద్యాలయంలోని మ్యాథమెటిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ కె.కృష్ణ కుమార్ మాట్లాడుతూ ఇంజనీరింగ్, సైన్స్ విభాగాలలో పైథాన్ ప్రోగ్రామింగ్ అప్లికేషన్‌లతో డేటా అనలిటిక్స్‌పై ఉపన్యాసం ఇచ్చారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు నైపుణ్యాలను గురించి వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శతాబ్దికి అవార్డుల పంట

విశాలాంధ్ర - మార్టూరు : ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ కోలలపూడి శతాబ్దికి అవార్డుల పంట. సమాజంలో పేదలకు సేవలు అందించి పలు అభివృద్ధి పథకాలు చేసిన కోలలపూడి శతాబ్దికి పలు అవార్డులు దక్కాయి క్లబ్ ఏర్పడిన అనతి కాలంలోనే మహిళల్లో చైతన్యం తీసుకువచ్చి పేదలకు పలు సేవలు అందించి రాష్ట్రంలోనే ముందంజలో ఉండటంతో తెలంగాణ రాష్ట్రం నిజామాబాదులో శుక్రవారం జరిగిన క్లబ్ కార్యక్రమంలో ఉత్తమ అధ్యక్షురాలుగా కందిమల్ల నిర్మలకు డిస్ట్రిక్ 315 అసోసియేషన్ అధ్యక్షురాలు సునీత జైన్ డిస్ట్రిక్ చైర్మన్ కోలా విజయలక్ష్మి నుంచి అవార్డు స్వీకరించారు. దీనితోపాటు క్లబ్ 71 ప్రాజెక్టులు పూర్తి చేసినందుకుగాను 11 ఉత్తమ సర్టిఫికెట్లు ప్రదానం చేసి క్లబ్ సభ్యులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు కందిమల్ల నిర్మల సెక్రటరీ శివకుమారి, అరుణ కుమారి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. మార్టూరు రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు బసవ రాములు, అంకమ్మ చౌదరి , కే. కాజారావు, ఆంజనేయులు , తాళ్లూరు సాంబశివరావు, ఈశ్వర ప్రసాద్ తాటి నాగేశ్వరరావు, చెరుకూరు అంజిబాబు, కోలలపూడి సర్పంచ్ మోరపాకుల సతీష్ కుమార్ క్లబ్ సభ్యులకు అభినందనలు తెలిపారు.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఎంపిక

విశాలాంధ్ర-మంగళగిరి : రోటరీ క్లబ్ ఆఫ్ మంగళ గిరి(2024-2025) నూతన అధ్యక్షుడిగా గాజుల శ్రీనివాసరావు, కార్యదర్శిగా అందె మురళీమోహన్, కోశాధి కారిగా వడ్లమూడి శ్రీనివాసరావు నియమితులైనట్లు క్లబ్ పూర్వ ప్రెసిడెంట్ అందె రేవంత్ తెలిపారు. ఈ మేరకు స్థానిక రోటరీ క్లబ్ కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో రేవంత్ వివరాలు వెల్లడించారు. తన పదవీ కాలంలో మంచి సేవా కార్యక్రమాలను నిర్వహించే అవకాశం లభించినట్లు చెప్పారు. ప్రధానంగా దివ్యాంగు లకు మంగళకరము 1, 2 పేరిట రెండు విడతలుగా కృత్రిమ చేతుల పంపిణీ చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. అలాగే పలు సంతృప్తి కరమైన సర్వీసు ప్రాజెక్టులను టీం సభ్యుల సహకారంతో విజయ వంతంగా నిర్వహించినట్లు తెలిపారు. రోటరీ క్లబ్ ట్రైనర్ అనిల్ చక్రవర్తి ఇసునూరు మాట్లాడుతూ రొటేరియన్లు తమ తమ వృత్తి వ్యాపారాలలో బిజీగా ఉన్నప్పటికీ సమాజ హితం కోసం పాటుపడాలనే లక్ష్యంతో సేవ ప్రాజెక్టులు చేపడుతున్నామని తెలిపారు. 2024-2025 నూతన రోటరీ క్లబ్ కార్యవర్గం ఆదివారం సాయంత్రం లిటిల్ విలేజ్ ఫంక్షన్ హాలులో ప్రమాణస్వీకారం చేయనున్నట్లు చెప్పారు. రోటరీ ఇంటర్నేషనల్ 3150 డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్ చంద్రచౌదరి డ్రీమ్ ప్రాజెక్టు అయిన సర్వైకల్ క్యాన్సర్ వాక్సినేషన్ సేవా కార్యక్రమాన్ని రోటరీ క్లబ్, రోటరీ కరవాలంబనం ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో తొలిసారిగా 'ప్రాజెక్టు శక్తి' పేరిట మంగళగిరిలో చేపడుతుండడం తమకెంతో సంతోషంగా ఉందని అన్నారు. సమావేశంలో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి కార్యదర్శి అందె మురళీమోహన్, కోశాధికారి వడ్లమూడి శ్రీనివాస రావు, సర్వీసు ప్రాజెక్టు డైరెక్టర్ కాపరౌతు సుందరయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు జిల్లా సెబ్ అధికారులు, సిబ్బంది సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబులను శనివారం కలిసి గత నాలుగు సంవత్సరాలుగా సెబ్/ఎక్సైజ్ శాఖలో నెలకొన్ని ఉన్న సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఇరువురు ఎమ్మెల్యేలు సెబ్ ఉద్యోగుల సమస్యల పరిష్కార దిశగా ఎక్సైజ్ మంత్రితో, ప్రభుత్వంతో చర్చిస్తామని, అలాగే సెబ్‌లో పనిచేస్తున్న ఎక్సైజ్ సిబ్బందిని వారి సొంత శాఖకు పంపించేందుకు, 2019 ముందు ఉన్న ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖను పునరుద్ధరించేలా కృషి చేస్తామని తెలిపినట్లు సెబ్ అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సెబ్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాసులు, ఈఎస్ ఎల్.రంగారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు పి.విజయ్‌కుమార్, లత, ప్రసన్న లక్ష్మీ, సబ్ ఇన్‌స్పెక్టర్లు తులసి, రెహమాన్, రాజేంద్ర, కానిస్టేబుల్స్ లక్ష్మానాయక్, వెంకటేశ్వర్లు, చెన్నారెడ్డి, పూర్ణ, ఆంజనేయులు, దిలీప్ రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యం... 9 నెలల నిండు గర్భిణి మృతి

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి పట్టణం రత్నాల చెరువులో నివసిస్తున్న మైల నిరీష్ 9 నెలల నిండు గర్భిణి... వైద్యం కోసం వెళ్లగా, డాక్టర్ల నిర్లక్ష్యంతో నిండు ప్రాణాలు పోయిన ఘటన శనివారం తెల్లవారుజామున జరిగింది. డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే నిరీష్ మృతి చెందిందని నిరీష్ భర్త గోపాలకృష్ణతో పాటు కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. భర్త మైల గోపాలకృష్ణ మాట్లాడుతూ పెదకాకాని మండల పరిధిలో గల కాళీ గార్డెన్స్, ఎన్ఎస్ఎన్‌హెచ్ కేవీపీబీ ట్రస్ట్ హాస్పిటల్‌లో ట్రీట్‌మెంట్ కోసం జాయిన్ చేశామని చెప్పారు. తల్లి బిడ్డకు ఎటువంటి ప్రమాదం లేదని అంతా క్షేమంగానే ఉందని శుక్రవారం మధ్యాహ్నం నుంచి డాక్టర్ చెప్పారన్నారు. శనివారం తెల్లవారుజామున 3 గంటలకు వచ్చి తల్లి బిడ్డ ఇద్దరూ మృతి చెందారని మృతదేహాన్ని తీసుకెళ్లాలని ఆసుపత్రి సిబ్బంది చెప్పినట్లుగా తెలిపారు. అప్పటికే వేలాది రూపాయలు ఖర్చు చేయించారని తెలిపారు. రాత్రి అంతా బాగానే ఉందని చెప్పి ఇప్పుడు ఎలా చనిపోయిందని బంధువులు ప్రశ్నించగా ఆసుపత్రి సిబ్బంది ఎటువంటి సమాధానం చెప్పకపోవడంతో ఆసుపత్రి ఎదుట కుటుంబ సభ్యులు ఆందోళన చేసినట్లుగా తెలిపారు.

గుండ్రెడ్డి శివకు శుభాకాంక్షల వెల్లువ

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి, జీఎస్ఆర్ బిల్డర్స్ అధినేత గుండ్రెడ్డి శివ పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర దళిత సంఘాల నాయకులు అధ్వర్యంలో ఆయన స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని బాపట్ల ప్రాంతంలోని ఎంతోమంది పేద వర్గాలకు అండగా నిలబడే మీరు నిండు నూరేళ్ళు హాయిగా జీవించాలన్నారు. బాపట్ల నియోజకవర్గ వ్యాప్తంగా అన్నీ రాజకీయ పార్టీ నాయకులు, కుల సంఘాలు, పార్టీలకు, కులాలకు అతీతంగా పెద్ద ఎత్తున్న గుండ్రెడ్డి శివకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత వాయిస్ ఏఎస్‌పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చార్వాక, మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి శీలం రోజుల బాబు, జిల్లా మాల మహానాడు అధ్యక్షులు మంచాల ఆనంద్, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ రహీం, ఆర్య నవీన్ కుమార్, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసిన కమిషనర్, మేయర్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: నగర పాలక సంస్థ అసమర్ధ పాలకుల చేతిలో చిక్కి కున్నారిల్లుతుందని జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి ఆవేదన వ్యక్తం చేశారు. నగర oలో ఎక్కడ చూసినా పారిశుధ్యం లోపించటంతో ప్రజలు రోగాల బారిన పడి ఆసుపత్రులకు క్యూ కడుతున్నా నగర కమీషనర్‌కి కానీ, మేయర్ కి కానీ చీమకుట్టినట్లుగా కూడా లేదని మండిపడ్డారు. శనివారం ఆయన జనసేన, టీడీపీ నాయకులతో కలిసి శ్రీనివాసరావుతోట, కేవీపీ కాలనీతో పాటూ పలు ప్రాంతాల్లో పర్యటించారు. వెహికల్ షెడ్డులో పాడైపోయిన ట్రాక్టర్లను, ఈ ఆటోలను పరిశీలించారు. ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి తీవ్ర దుర్గంధం వస్తుందని, వాన పడటంతో దోమలూ, ఈగలూ విజృంభిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటిపన్ను, నీటి పన్ను, చివరికి చెత్త పన్నులు కూడా ముక్కుపిండి వసూలు చేస్తున్న అధికారులు ప్రజలకు అదే స్థాయిలో మౌలిక వసతులు కూడా కల్పించాల్సిన బాధ్యత లేదా అని ప్రశ్నించారు. జనసేన పార్టీ డివిజన్ అధ్యక్షులు సయ్యద్ షర్ఫుద్దీన్, చెన్నం శ్రీకాంత్, గద్దం రోశయ్య, ఫణి, టీడీపీ డివిజన్ అధ్యక్షుడు షేక్ సన్నే, సయ్యద్ చాంద్, సాయి పాల్గొన్నారు.

37.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

విశాలాంధ్ర-తాడికొండ : మండలంలో శనివారం వేకువ జాము నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. ఏకధాటిగా 24 గంటలు వర్షం పడింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షం దాటికి మురుగునీరు రోడ్లపైకి వచ్చింది. పల్లపు భూములలో వర్షం నీరు చేరింది. పత్తి, పెసర, మినుము, జొన్న, వరి పంటలకు ఈ వర్షం ఎంతో మేలు చేసింది. 37.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

అధికారులు పనితీరు మార్చుకోవాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: డ్రైనేజీ, రోడ్ల సమస్యల మీద దృష్టి పెట్టమని పదేపదే అధికారులకు చెప్పిన కూడా పెడచెవిన పెట్టిన మాదిరిగా అధికారుల పనితీరు కనిపిస్తున్నదని, అధికారులు తమ పనితీరును మార్చుకోవాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షం వలన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రాంతమైన దేవాపరంలో ఎమ్మెల్యే మాధవి శనివారం పర్యటించారు. దేవాపురం 5వ లైన్ లోని పీకలవాగు గోడకు ఆనుకొని ఉన్న 2 బడ్డీకొట్లు వర్షం ధాటికి వాగులో పడిపోయి, నీటి ప్రవా హానికి అడ్డంకిగా మారిపోయాయని, వాగు మీద చెప్టా కూడా ప్రమాదకరంగా తయారైందని, అదేవిధంగా 4వ లైన్‌లో భారీగా చెత్తా కొట్టుకొని వచ్చి, చెప్టాల క్రింద నిలిచిపోవటం వలన ఆ మురుగు నీరు మొత్తం రోడ్ల మీద ప్రవహిస్తున్నదని స్థానిక ప్రజలకు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. అధికారులు వర్షాకాలంలో చాలా అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అందు బాటులో ఉండాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోపూరి నరేంద్ర, చింతకాయల శివ, వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.

ఇస్కాన్ సంస్థ ఆధ్యాత్మిక సేవలు భేష్ : మంగళగిరిలోని కొలనుకొండలో హరే కృష్ణ గోకులంలో వేంకటేశ్వరస్వామి ఆలయ అనంత శేషస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విధుల్లో భేష్.. అందరితో శభాష్

- సంచలన కేసులు గంటల వ్యవధిలో చేధన
- జిల్లాలో ప్రశాంతంగా సార్వత్రిక ఎన్నికల నిర్వహణ
- సమర్ధ్ యాప్ రూపకల్పనతో ఈసీచే ప్రసంశలు
- పనితీరుకు మెడల్స్‌తో సత్కారం
- బాపట్ల జిల్లాలో ఎస్పీ వకుల్ జిందాల్ మార్క్

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లాకు ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వకుల్ జిందాల్ విధుల్లో భేష్‌గా ఉండి అందరితో శభాష్ అనిపిం చుకున్నారు. చూడటానికి అత్యంత సౌమ్యంగా కనిపించే ఎస్పీ జిందాల్ విధి నిర్వహణలో చాలా కఠినంగా వ్యవ హరించేవారు. ఎంతటి వారైనా చట్టపరిధిలో నడుచుకో వాలని సిబ్బందితో పాటు ప్రజలకు తరుచుగా హెచ్చ రిస్తూ గీత దాటిన వారిపై వేటు వేశారు. జిల్లాలో క్లిష్ట కేసులు సంచలనంగా మారిన కేసులను గంటల వ్యవ ధిలో చేధించి శభాష్ ఎస్పీ అనేలా ప్రశంసలు పొందారు. - ఏప్రిల్ 3వ తేదీన 2022లో బాపట్ల జిల్లా తొలి ఎస్పీగా వకుల్‌జిందాల్ బాధ్యతలు తీసుకున్నారు. సరిగా నెల గడవక ముందే మే నెల 1 వ తేదీన జిల్లాలోని రేపల్లె రైల్వే స్టేషన్‌లో గర్భిణీపై భర్త కళ్ల ముందే సామూహిక అత్యాచార ఘటన జరగటంతో రాష్ట్రంలో సంచలనంగా మారింది. దీంతో జిల్లాలో తొలికేసును అత్యంత ఛాలెంజ్‌గా తీసుకున్న ఎస్పీ జిందాల్ తనదైన శైలిలో విచారణ చేపట్టి గంటల వ్యవధిలో నిందితులను అరెస్ట్ చేసి జెూ పోలీస్ బాస్ అనిపించుకున్నారు.

గత ఏడాది జూన్ నెలలో రేపల్లె నియోజకవర్గం చెరుకు పల్లి మండలంలో తన అక్కను వేధిస్తున్నాడని ప్రశ్నించి నందుకు అమర్నాథ్‌గౌడ్ అనే వ్యక్తిని అత్యంత దారు ణంగా పెట్రోల్ పోసి తగలబెట్టడం రాష్ట్ర వ్యాప్తంగా సంచ లనంగా మారింది. అప్పటి ప్రతిపక్షనేత ప్రస్తుత ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు సైతం బాధిత కుటుంబానికి పరామర్శించారు. ఇంత క్లిష్టమైన కేసును గంటల వ్యవధిలోనే చేధించి నిందితులను కటాకటాలకు పంపారు.

గత నెల జూన్‌లో చీరాల మండలం ఈపురుపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో సుచరిత అనే మహిళ తెల్లవారు ఝూమున బహిర్భూకి వెళ్లగా మత్తులో ఉన్న యువకులు ముకుమ్మడిగా అత్యాచారం చేసి ముఖంపై కొట్టి హత్య చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి అసెంబ్లీలో ప్రమాణ స్వీకారాలు జరుగుతన్న రోజే ఈ ఘటన జరగటంతో రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. దీంతో ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశంతో హోం మంత్రి వంగలపూడి అనిత అసెంబ్లీ నుంచి నేరుగా ఘటన స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు నిందితులను గంటల వ్యవధిలో అరెస్ట్ చేసి కటాకటాలకు పంపారు.

అదేవిధంగా జిల్లాలో తరుచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి శనివారం నో యాక్సిడెంట్ డేగా ప్రకటించి ప్రమాదాలు జరిగే స్థలంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేసి పోలీస్ సిబ్బందిని కేటాయించి ప్రతి శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో జిల్లావ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల తీవ్రత కొంత మేర తగ్గింది.

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల కోసం సమర్ధ్ యాప్‌ను రూపొందించి ఎన్నికల కమిషన్‌తో ప్రశంసలు పొందారు. సమర్ధ్ యాప్‌ను అన్నీ జిల్లా పోలీసులు విని యోగించేలా ఈసీ ఆదేశాలకు కూడా జారీ చేసింది. ఎక్కడ గొడవలు జరిగిన ఒక్క బటన్‌తో తెలిసి పోయేలా యాప్‌ను రూపొందించారు. ఈ యాప్ ఎన్నికల సమ యంలో ఎంతో ఉపయోగపడి గొడవలను ముందస్తుగా తెలుసుకుని అరికట్టేందుకు దోహదపడింది.

వీటితో పాటు గంజాయి, నాటుసారా నిర్మూలను ప్రత్యేక చర్యలు తీసుకుని ఎప్పటికప్పుడు దాడులు చేసి అరికట్టేందుకు కృషి చేశారు. 27 నెలల పాటు బాపట్ల జిల్లాలో ఎస్పీ వకుల్‌జిందాల్ విధి నిర్వహణలో చూపిన ప్రతిభకు ఒక గోల్డ్ ఒక సిల్వర్ మెడల్‌తో ప్రశంసించి సత్కరించారు. శనివారం జరిగిన బదిలీల్లో బాపట్ల నుంచి విజయనగరం జిల్లా ఎస్పీగా బదిలీ అయ్యారు. ఎస్పీ వకుల్ జిందాల్ బాపట్ల జిల్లాలో తనదైన మార్క్‌ను చూపించారు.

ఎమ్మెల్యేను కలిసిన దళిత సంఘాల ప్రతినిధులు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ అహ్మద్ ఆయన క్యాంపు కార్యాలయంలో భీమ్ భారత్, దళిత బహుజన ప్రజా సంఘాల ఐక్యవేదిక ప్రతి నిధులు శనివారం మర్యాద పూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా గుంటూరు నగరంలోని కొన్ని సమస్యలపై వినతిపత్రం భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ళ ప్రకాష్ అందజేశారు. అనంతరం పాగళ్ళ ప్రకాష్ మాట్లాడుతూ గుంటూరు ఏసీ కళాశాల ఎదురు ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్ నిర్మాణం మధ్యలో ఆగిపోవటం వలన శిథిలావస్థకు చేరుతుం దని, భవనం నిర్మాణం చేయుటకు ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి త్వరగా పూర్తి చేయగలరని విజ్ఞప్తి చేశారు. గతంలో ఈ భవనంలో పేద విద్యార్థులకు గ్రూపు-1, గ్రూపు-2 పరీక్షలకు ప్రిపేర్ అయ్యేవారని తెలిపారు. అంబేద్కర్ భవన్ అసంపూర్తిగా ఉండటం కారణంగా విద్యార్థిని, విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అసంపూర్తిగా ఉన్న అంబేద్కర్ భవనాన్ని త్వరితగతిన నిర్మాణం చేపట్టాలని కోరారు. కోడిగుడ్డు సత్రం ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్ నిర్మాణం 90శాతం పూర్తయిందని, మిగిలిన కొద్దిపాటి పనులు పూర్తి చేస్తే విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకం"మన్నారు. కార్యక్రమంలో ఉగ్గం సాంబశివరావు, సాధు మాల్యాద్రి, తాటికొండ నరసింహారావు, నల్లపు నీలాంబరం, డెన్సిస్ రాయ్, పాటిబండ్ల కోటేశ్వరరావు, చిన్నం డేవిడ్ విలియమ్స్, బాపట్ల ఏసుబాబు, ఉప్పలపాటి మున్ని తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా శస్త్ర చికిత్స

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు ప్రభుత్వ సమగ్ర (జీజీహెచ్)ఆసుపత్రిలో ఈఎన్‌టీ (ముక్కు గొంతు, చెవి)విభాగం వైద్యులు పేషంట్‌కు రూ.5 లక్షలు ఖర్చయ్యే శస్త్ర చికిత్సను డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా ఉచితంగా చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. శనివారం ఈఎన్‌టీ విభాగం వార్డులో హెచ్ఓడి డాక్టర్ ఉప్పాల శ్రీనివాస్‌తో కలిసి ఆపరేషన్ వివరాలను సూపరింటెండెంట్ వెల్లడించారు. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన గౌస్‌పీర్ ముక్కు వ్యాధితో గత నెల 22వ తేదీన జీజీహెచ్‌కు వచ్చారు. అంతకు ముందు ప్రొద్దుటూరులో చూపించారు. అక్కడ వైద్యం పరంగా ఎటువంటి ఫలితాలు కనపడలేదు. నిరాశతో ఉన్న కుటుంబ సభ్యులు గుంటూరు జీజీహెచ్‌లోని ఈఎన్‌టీ విభాగానికి వచ్చారు. ఈఎన్‌టి ప్రొఫెసర్ డాక్టర్ ఉప్పాల శ్రీనివాస్ పేషంట్‌ను పరీక్షలు చేసి రక్తం వచ్చే గడ్డ ముక్కు నుంచి నోట్లోకు వెళ్లిందని నిర్ధారించారు. ఒక్కొక్కసారి గుండెకు సంబంధించి కూడా సమస్యలు ఉంటాయని, ఈ రిస్క్ గురించి కుటుంబ సభ్యులకు వివరిం చారు. కుటుంబ సభ్యుల అనుమతి తీసుకుని గత శుక్రవారం ఈఎన్‌టీ, కార్డియాలజీ విభాగం వైద్యులు సంయుక్తంగా ఆపరేషన్ విజయవంతం చేశారు. తర్వాత ఎండోస్కోపి, మైక్రో డబ్రిడర్ పరికరాలతో రక్తం వచ్చే ట్యూమర్‌ను

తొలగించారు. దీంతో పేషంట్ ఆరోగ్యం కుదుటపడింది. రెండు మూడు రోజుల్లో పేషంట్‌ను డిశ్చార్జి చేస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ వెల్లడించారు. ఆపరేషన్‌ను విజయవంతం చేసిన వైద్యులను సూపరిం టెండెంట్ అభినందిం చారు. కార్డియాలజీ విభాగం హెచ్ఓడి డాక్టర్ శ్రీకాంత్, ఈఎన్‌టీ విభాగం అసిస్టెంట్ ప్రొఫె సర్లు డాక్టర్ రవీంద్రబాబు, డాక్టర్ అరుణ్ కుమార్, మత్తు వైద్యుడు శ్యాం కుమార్‌లు ఉన్నారు.

బుర్రిపాలెం రోడ్డులో కారు ప్రమాదం

విశాలాంధ్ర- తెనాలి : తెనాలి నుండి బుర్రిపాలెం వైపు వెడుతున్న కారు అదుపుతప్పి కాల్వలోకి దూసుకు పోయింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. శనివారం మధ్యాహ్నం బుర్రిపాలెం రోడ్డులో బిసి కాలని దాటిన తర్వాత పెమ్మసాని పెట్రోల్ బంక్ వద్ద తెనాలి వైపు నుండి బుర్రిపాలెం వైపు నకు వెడుతున్న కారు ఓవర్ స్పీడ్‌తో తెడుతున్న ఈ కారు రోడ్డు ప్రక్కన వున్న కటింగ్ షాప్‌ను ఢీకొని కారు బోల్తా కొట్టి పక్కన వున్న సైడ్ కాల్వలో పడిపోయింది. ఇది గమనించిన సమీపంలో వున్న వారు పరు గున వచ్చి కారులో వున్న నలుగురిని బయటకు తీసారు. కారులో వున్న వారికి ఎటువంటి గాయాలు కాలేదు. పెద్ద ప్రమాదం తప్పిపోయిందని ఊపిరి పీల్చుకున్నారు. కారు లోపల డాక్టర్‌కి సంబంధించిన శతస్కోప్ మరియు కారు పైన ఆన్‌డ్యూటీ డాక్టర్ అని వ్రాసివున్నది.

క్రీడా భారతి నూతన జిల్లా కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక స్వాప్ ఫిట్‌నెస్ సెంటర్ నందు గుంటూరు జిల్లా క్రీడా భారతి నూతన కార్యవర్గ సమా వేశం శనివారం జరిగింది. గుం టూరు జిల్లా క్రీడా భారతి చైర్మన్ గా గోల్డ్‌జిమ్ అధిపతి ఎం.గోపాల కృష్ణ, ప్రెసిడెంట్‌గా చల్లా వెంకటేశ్వరరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ నంబూరు సుబ్బారావు, జనరల్ సెక్రటరీగా కొనసా వేణుగోపాలరావు, ట్రెజరర్‌గా ఎం.రాజేశ్వరరావు, ఉపాధ్యక్షులు, జాయింట్ సెక్రటరీలుగా బీసీ మెంబర్‌ను ఎన్నుకోవడం జరిగింది. నూతనంగా ఎన్నిక కాబడిన వారు ఆదివారం విజయవాడలో జరుగు ఆల్ ఇండియా క్రీడా భారతి సమావేశంలో పాల్గొంటారని గుంటూరు జిల్లా క్రీడా భారతి సెక్రటరీ కొనసా వేణుగోపాలరావు వెల్లడించారు.

కిలాడి లేడీ ఘరానా మోసం

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి పట్టణంలో టిడ్కో గృహాలలో బ్యాంకు లోన్ల పేరుతో మహిళలను కిలాడి లేడీ బురిడీ కొట్టించింది. గుంటూరుకు చెందిన కిలాడి లేడీ రూ.3 వేలు కడితే రూ.2 లక్షల బ్యాంక్ లోన్ ఇప్పిస్తానంటూ ఘరానా మోసానికి పాల్పడింది. మంగళగిరి టిడ్కో సముదాయంలోని 80 మంది మహిళల నుంచి డబ్బులు తీసుకుని కిలాడీ లేడీ కొండవీటి శైలజ శనివారం పరారైంది. ఆ కిలాడి చేతిలో మోసపోయినట్లు తెలుసుకున్న బాధిత మహిళలు లబోదిబోమంటున్నారు. మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయం

విశాలాంధ్ర-మార్కాపురం : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని పరామర్శించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఎన్నికల ముందు టీడీపీ ఇచ్చిన హామీ మేరకు మార్కాపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించడంతో పాటు పశ్చిమ ప్రాంత ప్రజల ఆశాజ్యోతి పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులను పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందిస్తారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పశ్చిమ ప్రాంతాన్ని ముఖ్యంగా వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పశ్చిమ ప్రకాశంపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో సాంఘిక సంక్షేమశాఖకు అధిక ప్రాధాన్యత ఇస్తారన్నారు. గిద్దలూరు, మార్కాపురం ఎమ్మెల్యేలు ముత్తుముల అశోక్‌రెడ్డి, కందుల నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు మంత్రి పరామర్శ

విశాలాంధ్ర-మార్కాపురం : ఇటీవల కాలికి శస్త్ర చికిత్స అనంతరం తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని శనివారం రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కందులను పరామర్శించిన వారిలో ఏపీ యూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవీ సుబ్బారావు, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, వైపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబులు ఉన్నారు.

శివ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - కర్లపాలెం : కర్లపాలెం అబ్దుల్ కలాం ఫౌండేషన్ కార్యాలయంలో సర్పంచ్‌ల సంఘం మాజీ మండల అధ్యక్షులు గుండ్రెడ్డి శివ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు శివతో కలిసి కేక్ కట్ చేసి శివకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో జడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ పఠాన్ అహ్మద్ బాషా, కరిముల్లా ఖాన్ తదితరులు ఉన్నారు.

తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : వర్షాకాలంలో తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. తీర ప్రాంతాలలో ఇటీవల మృతుల సంఖ్య పెరగడంతో ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నగంజాం మండలం మోటుపల్లి గ్రామం రుద్రమంబాపురం, నిరీక్షణగిరి, వేటపాలెం మండలం కటారివారిపాలెం గ్రామం, చీరాల మండలం చీరాల బీచ్, బాపట్ల మండలం సూర్యలంక బీచ్‌లలో విస్తృతంగా పర్యటించారు. సముద్రంలోకి వెళ్లే మత్స్యకారులు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ చెప్పారు. బీచ్‌లలో భద్రత మరింత పెంచాలని అధికారులను ఆదేశించారు. సముద్రంపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులతో మాట్లాడారు. వారి జీవన శైలి, మత్స్య వేటలో ఎదురయ్యే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేటకు అవసరమైన బోట్లు, ఇతర పరికరాలపై ఆరా తీశారు. మత్స్యకారుల జీవన స్థితిగతులు, గ్రామంలో మౌలిక సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేట సమయంలో వలలు వేసినప్పుడు చెన్నై రాష్ట్రానికి చెందిన బోట్లు అక్రమంగా జొరబడి వలలు తెంపుకుని వెళ్తున్నాయని, దీంతో తీవ్రంగా నష్టపోతున్నామని మత్స్యకారులు ఆయనకు వివరించారు. కొన్ని సందర్భాలలో వేటకు వెళితే వచ్చే చేపలు, రొయ్యలతో భోజనానికి కూడా చాలడం లేదని తెలిపారు. వేటకు వెళ్లిన సమయంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా గ్రామంలోని వారు గాకుండా పర్యాటకులు ఎవరైనా సముద్రంలో స్నానాలు చేయడానికి వస్తే జాగ్రత్తలు పాటించాలన్నారు. సముద్రంలో లోతుకు వెళ్లకుండా వారికి అవగాహన కల్పించాలని మత్స్యకారులకు సూచించారు. తీరంలో మద్యం తాగడం, అదే క్రమంలో సముద్రంలోకి వెళ్తున్నట్లు గుర్తిస్తే మత్స్యకారులు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మోటుపల్లి రుద్రమంబాపురంలోని వీరభద్రాలయాన్ని కలెక్టర్ పరిశీలించారు. ప్రాచీన కాలంనాటి వీరభద్రాలయంలో పూజలు చేశారు. పురావస్తుశాఖ అధికారులు భద్రపరిచిన శిలాఫలకాలను పరిశీలించారు. ఆ గ్రామంలో మత్స్యకారులతో కలెక్టర్ మాట్లాడారు. పిల్లలకు పాఠశాల లేదని, తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. విద్యుత్ స్తంభాల నిర్మాణ సమయంలో పైపులైన్లు దెబ్బ తిని తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని ఫిర్యాదు చేశారు. తుపాను షెల్టర్ లేదని, ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు పాఠశాల లేక ఇబ్బందులు పడుతున్నామని మత్స్యకారులైన రాణమ్మ, విజయలు కలెక్టర్‌కు వివరించారు. ఆయన వెంట చీరాల ఆర్డీఓ సూర్యనారాయణరెడ్డి, బాపట్ల ఆర్డీఓ జి రవీందర్, తహశీల్దారులు తదితరులు ఉన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

విశాలాంధ్ర - రేపల్లె : వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి సురక్షితంగా ప్రయాణం చేసి గమ్యస్థానాలకు చేరుకోవచ్చునని రేపల్లె మండల న్యాయ సేవ అధికార సంస్థ పరిధిలోని పారా లీగల్ సీనియర్ వాలంటీర్ ఆర్.శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఆర్టీసీ డ్రైవర్లకు, కండక్టర్లకు గ్యారేజీ కార్మికులకు న్యాయవిజ్ఞాన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. రేపల్లె మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్లు వాహన చోదకులకు హెల్మెట్ వలన కలిగే ఉపయోగాలు, పెట్టుకోకపోవడం వల్ల కలిగే అనర్ధాలు గురించి ఉచిత న్యాయ విజ్ఞాన కార్యక్రమాన్ని అవగాహన ద్వారా క్షుణ్ణంగా వివరించారు. రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని వారు కోరారు భద్రత మార్గదర్శకాలను కూడా తప్పనిసరిగా పాటించాలన్నారు. వాహనం నడిపే వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని రోడ్డు ప్రమాదాల నివారణలో వాహన శోధకులు సంబంధిత రవాణా శాఖ అధికారులకు సహకరించాలని కోరారు. హెల్మెట్ ధరించండి సురక్షితంగా గమ్యస్థానాలు చేరండి అంటూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్లు సిహెచ్ నాగమల్లేశ్వరరావు ,సయ్యద్ తాహిర్ అహ్మద్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, కమలాకర్, బ్రహ్మయ్య, బుజ్జి, శ్రీనివాసరావు, నవీన్ రత్నం, సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ నిర్మల్ కుమార్ బాధ్యతలు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా వి.నిర్మల్ కుమార్ ఛాంబర్‌లో శనివారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత శివాలయం, అంజయనే స్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యాలయంకు వచ్చిన కమిషనర్‌కు మున్సిపల్ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మున్సిపల్ ప్రధాన ఉద్యోగులతో సమావేశాన్ని నిర్వహించి తాగునీటి చెరువును అధికారులతో కలసి పరిశీలన చేశారు. త్వరలో ప్రారంభంకానున్న అన్నా క్యాంటీన్‌ను అధికారులు తెలుగుదేశం పార్టీ నాయకులతో కలసి పరిశీలించారు. రానున్న రోజుల్లో పూర్తిస్థాయిలో బాపట్లను అభివృద్ధి పథంలో నడిపేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

భారత హేతువాద సంఘం వార్షిక మహాసభలు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ఎన్జీఓ హోం మీటింగ్ హాల్‌లో భారత హేతువాద సంఘ 93వ వార్షిక మహాసభలు ప్రారంభమయ్యాయని సంఘ ఉపాధ్యక్షులు డాక్టర్ గుమ్మ వీరన్న పేర్కొన్నారు. ఎన్జీవో హోం మీటింగ్ హాల్లో గుమ్మ వీరన్న సభా అధ్యక్షతన భారత హేతువాద సంఘ ఇంగ్లీష్ బులిటన్ నంబర్ 11ను విశ్రాంత ప్రొఫెసర్ జె.లక్ష్మారెడ్డి ఆవిష్కరించి సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూఢ విశ్వాసాలతో ప్రజలు ఉన్నందు వల్ల సక్రమంగా ఆలోచించ లేకున్నారని హేతువాద మానవాద ఉద్యమం అత్యవసర ఉద్యమం అన్నారు. ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘ సహాయ కార్యదర్శి సింహాద్రి యల్లమందారెడ్డి మాట్లాడుతూ కులమత రాజకీయాల వల్ల ప్రజాస్వామ్యం పతనం అవుతుందన్నారు. భారత హేతువాద సంఘ వైస్ చైర్మన్ మాట్లాడుతూ మత విశ్వాసాలను ప్రభుత్వాలు పెంచి పోషించడం సెక్యులరిజం కాదన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో మత కార్యక్రమాలు ఉండరాదన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడుతూ సెక్యులరిజంను అమలు చేయాలన్నారు. ప్రభుత్వానికి మతానికి అడ్డు గోడ ఉండాలన్నారు. కులమతాలు, రాజకీయాలు కలవడం వలన ఫాసిజం నియంతృత్వం అమలు అవుతుందన్నారు. కులమతాల వల్ల ప్రజాస్వామ్యం పతనం అతుందన్నారు. అనంతరం మేడూరి రచన భావ విప్లవం గ్రంథాన్ని డి.రాజశేఖర్ ఆవిష్కరించి సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో కేరళ హేతువాద సంఘం, నాయకులు కే పి జార్జ్, కేరళ హేతువాద సంఘ ఉపాధ్యక్షులు కె.య. సదానందన్, మేడూరి సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘ ప్రధాన కార్యదర్శి షేక్ దరియావలి, భారత హేతువాద సంఘ సహాయ కార్యదర్శి బాచిన కిషోర్ తదితరులు పాల్గొన్నారు.